ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



సిద్దిపేట

20

ఆదివారం 20 ఆగస్టు 2017


పంటకు జీవం

జీవం పోతున్న పంటకు ప్రాణం లేచొచ్చింది. ఎండుముఖం పట్టిన నారుమళ్లు చినుకు తగిలి మురిసిపోయాయి. వరుణుడి కరుణ కోసం రెప్పవాల్చకుండా ఎదురుచూస్తున్న రైతన్నకు ఊరట లభించింది. హమ్మయ్య వర్షం పడిందని అన్నదాతలు ఊపిరిపీల్చుకున్నారు. శనివారం తెల్లవారుజాము నుంచి రాత్రి వరకు జిల్లా అంతటా వాన కురియడంతో చెరువులకు, కుంటలకు జలకళ వచ్చింది. జిల్లాలో 49 మి.మీ.ల సాధారణ వర్షపాతం నమోదైంది.



అక్కన్నపేట మండలం జనగామలో భారీ వర్షంతో నీట మునిగిన పత్తిపంట

- హమ్మయ్య వర్షం కురిసింది
- మురిసిన అన్నదాతలు
- జిల్లా అంతటా వరుణుడి కటాక్షం
- అన్ని మండలాల్లో మోస్తరు వానలు
- చెరువులు, కుంటలకు జలకళ
- తొలిసారిగా రోజంతా వర్షం
- 49 మి.మీ. వర్షపాతం నమోదు



లింగారెడ్డిపల్లిలో పొలంలో గట్టు ఏర్పాటు చేస్తున్న రైతు పరశురాములు

5



ప్రదర్శన ఇస్తున్న దేవదాసు (ఫైల్)

జాంబవంతుడి వారసత్వం
యక్షగానానికి ప్రాణం

- చిన్నతనం నుంచే చిందు, యక్షగానంలో రాణిస్తున్న పిల్లుట్ల దేవదాసు
- తండ్రి పిల్లుట్ల అబ్బసాయిలే ఆదర్శం
- సుమారు 20 వేలకు పైగా ప్రదర్శనలు
- మైరావణుడు పాత్ర ఆయనకెంతో ఇష్టం
- పలు అవార్డులతో ప్రముఖుల సత్కారం
- తెలంగాణ ఉద్యమంలో తనవంతు కళాపోషణ
- ఈ కళకు పూర్వవైభవం తీసుకొచ్చేందుకు కృషి

▶ సెంటర్ స్ప్రెడ్‌లో



జగ్గారెడ్డీ.. నీ నాటకాలు ఇక సాగవు !

- ముగ్గురు సీఎంల పంచన తిరిగి ఏం చేశావు ?
- అధికారంలో ఉన్నప్పుడు ఒరగబెట్టిందేమిటి ?
- టీఆర్ఎస్‌కు విజన్ ఉంది
- సీఎంను, హరీశ్‌ను విమర్శిస్తే హీరోవు కాలేవు
- సంగారెడ్డిలో ప్రజా నాయకుడున్నాడు
- ఎమ్మెల్సీ ఫారూఖ్‌హుస్సేన్ మండిపాటు

5

కూరగాయల సాగులో జిల్లాను నంబర్‌వన్‌గా నిలుపుతాం

- నాణ్యమైన నారు, పరికరాలు అందించేందుకు కృషి
- ఉద్యానవన సాగుపై సీఎం, మంత్రి హరీశ్‌రావు ప్రత్యేక దృష్టి
- మొబైల్ రైతుమార్కెట్లు మరిన్ని అవసరం
- రైతుబజార్లలో రైతులే నేరుగా అమ్ముకునేలా చర్యలు
- రాష్ట్ర ఉద్యానవనశాఖ కమిషనర్ వెంకట్రామారెడ్డి



ములుగులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో పంటలను పరిశీలిస్తున్న వెంకట్రామారెడ్డి

4

తపాస్‌పల్లికి
జలకళ

- రిజర్వాయర్లలోకి గోదావరి జలాల పంపింగ్
- భారీగా చేరిన నీరు
- చెరువుల్లోకి మళ్లింపునకు సన్నాహాలు
- అన్నదాతల హర్షం

4



రిజర్వాయర్‌లోకి పంపింగ్ చేస్తున్న గోదావరి జలాలు

ఇంటర్వ్యూ



పాఠశాలల్లో డిజిటల్ తరగతుల

నిర్వహణకు చర్యలు

• భక్షి విజయరావు, యునిసెఫ్ రాష్ట్ర కో ఆర్డినేటర్

నారాయణఖేడ్ : పాఠశాలల్లో డిజిటల్ తరగతుల నిర్వహణకు యునిసెఫ్ ద్వారా చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర కోఆర్డినేటర్ భక్షి విజయరావు ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు.

పాఠశాలల్లో డిజిటల్ తరగతులను ఏ విధంగా నిర్వహిస్తారు ?

పాఠశాలల విద్యార్థులకు ఆయా విషయాలు సులభరీతిలో అర్థంకావడం కోసం ప్రత్యేకంగా ఉపాధ్యాయుల ద్వారా డిజిటల్ పాఠ్యాంశాలను తయారు చేయించి బోధించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

ఇప్పటి వరకు ఎన్ని పాఠ్యాంశాలు తయారు చేశారు ?

ఇప్పటి వరకు అన్ని విషయాల్లో కలిపి 400 వందల డిజిటల్ పాఠ్యాంశాలను తయారు చేయించాం.

మధ్యాహ్న భోజనం పరిశుభ్రతతో అందించేందుకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు ?

మధ్యాహ్న భోజనాన్ని శుచి, శుభ్రతతో పాటు విద్యార్థులకు రుచిగా అందించాలనే ఆలోచనతో మా సంస్థ ద్వారా మధ్యాహ్న భోజనం నిర్వాహకులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నాం. రాష్ట్ర వ్యాప్తంగా 28 వేల పాఠశాలలు ఉన్నాయి. ఇప్పటి వరకు చాలా పాఠశాలల భోజనం నిర్వాహకులకు శిక్షణ ఇప్పించాం.

రాష్ట్ర వ్యాప్తంగా ఎంత మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందుతోంది ?

రాష్ట్ర వ్యాప్తంగా 32 లక్షల మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని ప్రభుత్వం అందిస్తుంది. భోజనాన్ని ప్రభుత్వ నిబంధనల ప్రకారం విద్యార్థులకు వండి వడ్డించే విధంగా మా సంస్థ అవసరమైన సూచనలు, సలహాలు అందిస్తుంది.

పరిశుభ్రత కోసం చేపడుతున్న కార్యక్రమాలు ఏమిటి?

పరిశుభ్రత లేక పోవడంతోనే విద్యార్థులు అనారోగ్యానికి గురవుతున్నారు. అందువల్ల భోజనానికి ముందు తర్వాత చేతులను పరిశుభ్రంగా ఉంచుకోవాలనే ఆలోచనతో మొదటి దశలో గురుకుల పాఠశాలల విద్యార్థులకు చేతుల శుభ్రతపై అవగాహన కార్యక్రమాలను కల్పిస్తున్నాం.



నారోజు రచించిన పుస్తక ముఖ చిత్రం


రాజమౌళి దంపతులను సన్మానిస్తున్న రచయితలు (ఫైల్)


నారోజు రాజమౌళి

నారోజు..

- **7వేలకు పైగా పద్యాలు రాసిన రాజమౌళి**
- **చందోబద్ధంగా ఏ అంశంపైనా అయినా రోజుకు వంద పద్యాలు రాయడంలో దిట్ట**
- **భగవద్గీతను తాత్పర్య సహితంగా తెలుగులోకి అనువదించిన కవి**

కవిత్వంలో రారాజు

హుస్నాబాద్ : వచన కవిత్వం సులభంగా రాసే ప్రకియ. ఇందులో స్వేచ్ఛ ఉంటుంది. కాని పద్యం అంత సులువుగా రచించేది కాదు. పద్యం చందోబద్ధంగా ఉండాలి. పద సంపద, శుద్ధత ఉండాలి. కట్టుబాటులో రాయాలి. చివరి పాదం తీసుకుంటే నాలుగు పాదాలు, పద్యం భావం అర్థ యుక్తంగా ఉండాలి. పద్యం సామాన్యుల దగ్గరికి చేరనప్పటికీ అందులో మంచి రమ్యత ఉంటుందంటారు రచయితలు. అందుకే పద్యం శాశ్వతమైనదంటారు. ప్రస్తుతం పద్యాలు రాసే కవులు అరుదు. కాని హుస్నాబాద్ పట్టణంలోని గణేశ్ నగర్‌కు చెందిన నారోజు రాజమౌళి పద్య కవిత్వంలో రారాజుగా నిలుస్తున్నారు. హుస్నాబాద్ మండలం పొట్లపల్లికి చెందిన నారోజు రాజమౌళి హుస్నాబాద్‌లో స్థిరపడ్డారు. చిన్న నాటినుంచే పద్యాలు రాయడం అలవాటుగా మార్చుకున్నారు ఈయన. జెజ్జంకిలో ఏడో తరగతి చదువుతున్న సమయంలో అక్కడి తెలుగు మాస్టర్ రాజమౌళిని ప్రోత్సహించారు. పదో తరగతి నుంచి పద్య కవిత్వంలో కావ్యాలు రాశారు. ప్రైవేట్ ఉపాధ్యాయుడిగా పని చేస్తూనే బీఏ తెలుగు చదివారు. రాజమౌళి ఏకంగా ఏడు వేల పద్యాలు రాశారు. ఏదైనా ఒక అంశం ఇస్తే చందోబద్ధంగా ఒకే రోజు వంద పద్యాలు అలవోకగా రాయగలిగే సాహితీవేత్త. పద్యాలే కాదు.. స్టేజీ నాటకాలు, శ్లోకాలు కూడా ఈయన రచించారు. పద్య రచనల్లో ఎన్నో ప్రయోగాలు చేశారు. ఈయన సామాన్యులకు కూడా అర్థమయ్యేలా రచనలు చేశారు. ఎక్కువగా అధ్యాత్మికతకు రచనలకు ప్రాధాన్యత ఇస్తారు ఈయన. అలాగని సామాజిక అంశాలను విస్మరించలేదు. వీటిపై కూడ పద్య ప్రక్రియలోనే రచనలు చేశారు. వాస్తు జ్యోతిష్య శాస్త్రంలో కూడా ఈయనకు ప్రావీణ్యం ఉంది. వేదాల్లో పరిచయం ఉంది. ఉపనిషత్తులు, ఇతిహాసాలు, పురాణాల్లో ప్రావీణ్యం ఉంది. ఎన్నో కావ్యాలకు ముందు మాట రాశారు. పద్యం చివరి పాదం ఇస్తే పద్యమును పూర్తిగా రాసే సమస్యాపూరణ ప్రక్రియలో రాజమౌళి అందే వేసిన చేయి. అందుకే రాజమౌళి రచించిన శ్రీ జానకి రామ శతకంను రాజయోగాశ్రమం (రంజోహి) మఠాధిపతి యం రాచయ్య చదివి...

శ్రీ జానకీరామశతక రచన భవసాగరపు నావ
భవరోగహరమునకు దివ్యగుళిక
సకల జనులకు తెలిసేడి సరళ రచన
నరుని హరునిగజేయు నారోజు రచన..అని ప్రశంసలు కురిపించారు.

రాజమౌళి రచించిన పద్యకావ్యాలు

నారోజు రాజమౌళి రచించిన పద్యాకావ్యాలు దాదాపు పది వరకు ఉన్నాయి. విశ్వనాథ శతకం (ఆటవెలది), పొట్లపల్లి స్వయంభూ రాజేశ్వర శతకం (సీసపద్యాలు), యోగి మేమన శతకం (కందం), శ్రీమద్భవగద్గీత (తేటగీతులు), శ్రీ జానకీ రామ శతకం (తేటగీతి), విభవసారం (తేటగీతి), వెయ్యి పద్యాల శ్రీరఘువర చరితం (కందం), హనుమాన్ సుప్రభాతం, పొట్లపల్లి స్వయం సుప్రభాతం (శ్లోకాలు), అముద్రితాలు వృక విలాపం, (ఉత్పల మాల), ఉగాదులు, ఉషస్సులు (ఉత్పల మాల), బ్రహ్మంగారి జీవిత చరిత్ర (స్టేజీనాటకం) రాశారు.

పద్యంలో ప్రయోగాలు

సంస్కృతంలో ఉన్న శ్రీమద్భగవద్గీతను తాత్పర్య సహితంగా తేట గీతి పద్యాలతో తెలుగులోకి అనువదించారు రాజమౌళి. రామాయణం, భారతం, భాగవతాల మూలాన్ని మార్చకుండా పద్యాలు రాశారు. రాజమౌళి పద్యాల్లో మకుటాలు కూడా ఉన్నాయి. అవే పదాలు పదేపదే వాడుతూ అర్థాలు మాత్రం వేరే వచ్చే విధంగా పద ప్రయోగం చేస్తారు. రఘువర చరితంలోని 800 పద్యాలు కేవలం 20 రోజుల్లో పూర్తి చేశారు. రోజుకు వంద పద్యాలు అలవోకగా రాయగలరు.

బిరుదులు

రాజమౌళికి పలు సంస్థలు బిరుదులు ప్రధానం చేశాయి. లయన్స్ క్లబ్ వారు కవితా భూషణ, కప్పగంతుల లక్ష్మణశాస్త్రి స్మారక అవార్డు, హుస్నాబాద్ కవి బృందం అపర వాల్మికీ బిరుదులు ప్రదానం చేశారు. ఎన్నో సంస్థలు రాజమౌళిని సన్మానించాయి. పెండోట వెంకటేశ్వర్లు రాసిన బ్రహ్మంగారి జీవిత చరిత్రకు (సిద్దిపేట), తరిగొప్పుల నారాయణస్వామి రాసిన భాగవతం, చంద్రశేఖర శతకాలకు ముందు మాట రాశారు. పలువురు పదవీవిరమణ పొందిన సందర్భంగా రచనలు చేశారు. కుటుంబ సభ్యులు ముఖ్యంగా తన భార్య ప్రేమలతాదేవి సహకారంతో రచనల్లో మరింత వేగం పెంచడానికి కారణమైందంటారు రాజమౌళి.

వాస్తు జ్యోతిష్య శాస్త్రాల్లో ప్రావీణ్యం

రాజమౌళికి వాస్తు, జ్యోతిష్య శాస్త్రాల్లో కూడ ప్రావీణ్యం ఉంది. ఇళ్ల నిర్మాణాల కోసం వాస్తు సలహాలు తీసుకునేందుకు నిత్యం ప్రజలు ఆయన వద్దకు వస్తుంటారు. జ్యోతిష్యంలోనూ సంప్రదిస్తారు.

ఉపయుక్తమైన రచనలు ఉండాలి

భావ అర్థముల సమ్మెళనమే శుద్ధం. అలాంటి శుద్ధమైన రచనలుండాలి. అందరికీ ఉపయుక్తమైన రచనలు ఉండాలి. ఒక రచన చదివితే పాఠకుడి భావనలో మార్పు తీసుకువచ్చే విధంగా, హృదయాలను హత్తుకునేలా ఉండాలి. పద్యం శాశ్వతమైనది. పద్యం కట్టుబాటులో రాయాల్సి ఉంటుంది. 50వేల పద్యాలు రాయాలనేది నా సంకల్పం.

- నారోజు రాజమౌళి, కవి రచయిత


నారోజు రచించిన పుస్తకాలు

సమస్యలు పరిష్కరించే వరకు

సమ్మె కొనసాగిస్తాం

• శిరోమణి , డాక్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు

ఉద్యోగపర్వం



డాక్ ఉద్యోగుల న్యాయపరమైన సమస్యలను పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తాం. మాపై పనిభారం అధికమైంది. అందువల్ల ఎనిమిది గంటల పని విధానాన్ని కొనసాగించాలి. పెన్షన్ సౌకర్యాన్ని కూడా కల్పించాలి. కమలేష్‌చంద్ర కమిటీ సిఫార్సులను కూడా అమలు చేయాలి. మమ్మల్ని కూడా సివిల్ సర్వెంట్ ఉద్యోగులుగా గుర్తించాలి. ఈ మేరకు అఖిల భారత డాక్ ఉద్యోగుల సంఘం పిలుపు మేరకు సమ్మెను చేస్తున్నాం. అందువల్ల ప్రభుత్వం తమ న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలి. **- నారాయణఖేడ్**

భక్తుల ఇష్టదైవంగా కొలువుదీరిన శ్రీకృష్ణుడు

భక్తి

• పురుషోత్తమ చారి, పూజారి



భక్తుల ఇష్టదైవంగా శ్రీకృష్ణుడు బాసిల్లుతున్నాడు. నారాయణఖేడ్‌లో దశాబ్దాల క్రితం శ్రీకృష్ణ మందిర్‌ను నిర్మించి రాధాకృష్ణుల పంచలోహ విగ్రహాలను ప్రతిష్టింపజేసి నిత్య పూజలు నిర్వహించే వారు. మూడు దశాబ్దాల క్రితం దొంగలు ఆలయంలోని పంచలోహ విగ్రహాలను దొంగిలించుకు పోయారు. పది సంవత్సరాలకు పైగా ఆలయంలో నిత్య పూజలు కొనసాగలేదు. ఆలయ వ్యవస్థాపకుడు నందుసేట్ 2006లో జైపూర్ నుంచి ప్రత్యేకంగా రాధాకృష్ణుల విగ్రహాలను తెప్పించి ఆలయంలో ప్రతిష్టింపజేశారు. ఆలయ ఆవరణలో గోశాలను ఏర్పాటు చేశారు. పదకొండు సంవత్సరాలుగా ఆలయంలో నిత్య పూజలు కొనసాగుతున్నాయి. శ్రీకృష్ణజన్మాష్టమి, కార్తీక పౌర్ణమి, వైకుంఠ ఏకాదశి, కౌజాగిర్ పౌర్ణమి, గోవర్దన గిరి పూజలు ఇక్కడ ప్రత్యేకంగా నిర్వహిస్తుంటారు. దేవాలయంలో భక్తుల సంఖ్య ఎప్పటికప్పుడు పెరుగుతూనే ఉంది. ఆలయంలో భక్తుల సహకారంతో వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.



- నారాయణఖేడ్

బతుకమ్మ చీరల జాబితా రూపొందించాలి

• జాయింట్ కలెక్టర్ పద్మాకర్



వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడుతున్న జేసీ పద్మాకర్

సిద్ధిపేట రూరల్ : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బతుకమ్మ చీరల పంపిణీ పారదర్శకంగా నిర్వహించేందుకు రేషన్ డీలర్లు కృషి చేయాలని జాయింట్ కలెక్టర్ పద్మాకర్ సూచించారు. శనివారం రాత్రి జిల్లా కలెక్టర్ కార్యాలంలో జరిగిన వీడియో కాన్ఫరెన్సులో జేసీ మాట్లాడారు. తెల్లరేషన్ కార్డు కలిగిన వారి జాబితా రూపొందించాలని సూచించారు. బతుకమ్మ చీరలు అందించేందుకు లబ్ధిదారుల ఎంపికలో తహసీల్దార్లు, ఎంపీడీవోలు, గ్రామం వీఆర్వో, పంచాయతీ కార్యదర్శి, వీవో లీడర్లు సభ్యులుగా ఉంటారని తెలిపారు. దీపం పథకానికి అర్హులైన వారిని గుర్తిస్తే గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేస్తామన్నారు. రేషన్ సరుకులు ఈ పాస్ ద్వారా ఈ నెల 25వరకు పంపిణీ పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సివిల్ సప్లయ్ అధికారి వెంకటేశ్వర్లుతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధికి దరఖాస్తుల స్వీకరణ

• జనరల్ మేనేజర్ నవీన్‌కుమార్

సిద్ధిపేట రూరల్ : సిద్దిపేట జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులు స్వయం ఉపాధి కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ నవీన్‌కుమార్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ 2017-18 సంవత్సరానికి గాను ప్రధానమంత్రి స్వయం ఉపాధి ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. జిల్లా పరిశ్రమల కేంద్రం , కేవీఐసీ, కేవీఐబీ పథకాల ద్వారా రుణ సౌకర్యం అందిస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంత లబ్ధిదారులకు మున్సిపల్, నగర పంచాయతీలలోని లబ్ధిదారులకు 25 శాతం ప్రభుత్వం సబ్సిడీ అందిస్తుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు కేవీఐసీ డాట్ ఓఆర్‌జీ డాట్ ఇన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

అటవీ శాఖ ఉద్యోగాలకు ఉచిత కోచింగ్

సిద్ధిపేట రూరల్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన అటవీశాఖలోని ఖాళీల భర్తీకి అర్హులైన అభ్యర్థులకు సిద్దిపేట బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు డైరెక్టర్ రాములు తెలిపారు. ఫారెస్ట్ రెంజ్ ఆఫీసర్స్ , ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్స్, బీట్ ఆఫీసర్స్ ఉద్యోగాలకు అర్హులైన అభ్యర్థులు ఈ నెల 21 నుంచి 31 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. టీఎస్‌బీసీ స్టడీ సర్కిల్ . సీజీజీ. జీవోవీ. ఐఎన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు . గ్రామీణ ప్రాంత అభ్యర్థులు రూ. లక్ష 50 వేలు , పట్టణ ప్రాంత అభ్యర్థులు రూ. 2 లక్షలు ఆదాయం కలిగిన వారు ఉచిత కోచింగ్‌కు అర్హులని చెప్పారు. సెప్టెంబర్ 4 నుంచి శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. 08457-224941 , 9985434941 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

పీఆర్ ఈఈపై కలెక్టర్‌కు ఫిర్యాదు

సిద్ధిపేట రూరల్ : పంచాయతీరాజ్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాజశేఖర్‌రెడ్డిపై కాంట్రాక్టర్ శ్యాంసుందర్ శనివారం సిద్దిపేట జిల్లా కలెక్టర్‌కు రాత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. అనంతరం కాంట్రాక్టర్ విలేకరుతో మాట్లాడుతూ చేర్యాల మండలం అంగడీ కిష్టాపూర్ మదిర గ్రామమైన గణేశ్‌పల్లిలో కుల సంఘం భవనం నిర్మించి మూడు నెలలు గడిచినా బిల్లు ఇవ్వడం లేదంటూ అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేదన్నారు. ఇదే విషయంపై జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా బిల్లు మంజూరు చేయాలని కలెక్టర్ ఆదేశించారని తెలిపారు. శనివారం పంచాయతీరాజ్ కార్యాలయంకు వెళ్లి ఈఈని కలిసి బిల్లు ఇవ్వాలని కోరగా ఎంబీ రికార్డు బుక్ టెబుల్‌పై పెట్టి వెళ్లిపోమ్మంటూ దూషించారని కాంట్రాక్టర్ తెలిపారు. చెప్పుకోలేని పదజాలంతో దూషించారని , తన ఛాంబర్ నుంచి వెళ్లిపోమ్మంటూ తిట్టారని చెప్పారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్‌కు రాతపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

పాము కాటుతో బాలుడి మృతి

నంగునూరు : నంగునూరు మండలం సిద్దన్నపేటలో కూలీలుగా పనిచేస్తున్న శ్రీనివాస్ కుమారుడు సిద్ధు (6) శనివారం పాము కాటుకు గురై మృతి చెందాడు. ఖమ్మం జిల్లా బియ్యారం గ్రామానికి చెందిన శ్రీనివాస్, మనకమ్మ వలస కూలీలుగా జీవనం సాగిస్తున్నారు. సిద్దన్నపేట నుంచి మల్లారం వరకు చేపట్టిన రోడ్డు పనుల్లో భాగంగా అదే గ్రామానికి చెందిన కొందరు కూలీలతో కలిసి నంగునూరు మండలం సిద్దన్నపేట శివారులో ఉన్న కొట్టంలో తాత్కాలికంగా నివాసం ఉంటున్నారు. శనివారం తెల్లవారుజామున సిద్దుకు పాముకు కరిచింది. అపస్మారక స్థితిలోకి వెళ్లిన విషయం గమనించిన తల్లిదండ్రులు ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే బాలుడు మృతి చెందాడని వైద్యులు తెలిపారు.

సీపీఎం నాయకులపై అట్రాసిటీ కేసు

• మండల సభకు ఆటంకం కల్గించిన నాయకులపై కేసు

• రేబర్తి సర్పంచ్ భూపతిని కులం పేరుతో దూషించిన ముగ్గురిపై అట్రాసిటీ కేసు

మద్దూరు: మండలపరిషత్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలోకి అనుమతులు లేకుండా ప్రవేశించి సభకు ఆటంకం కలిగించి అధికారుల, ప్రజాప్రతినిధులను దూషించిన ఘటనలో సీపీఎం పార్టీ మండల కార్యదర్శి ఆలేటి యాదగిరి, సుంచు విజేందర్‌తో పాటు మరో పది మందిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ విల్సన్ తెలిపారు. శనివారం ఏఎస్ఐ విలేకరులతో మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం సీపీఎం ఆధ్వర్యంలో మండలపరిషత్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి అనుమతులు లేకుండా సమావేశ మందిరంలోకి వెళ్లి సభను ఆటంకపర్చడంతో పాటు సమావేశంలోని అధికారుల, ప్రజాప్రతినిధులను దూషించినందుకు చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

కేసు నమోదు

మండలపరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి వెళ్లి వస్తున్న రేబర్తి గ్రామానికి చెందిన సర్పంచ్ అందె భూపతిని కులం పేరుతో దూషించిన ముగ్గురిపై ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ విల్సన్ తెలిపారు. శుక్రవారం మద్దూరు మండలంలోని మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశానికి వెళ్లి తిరిగి ఇంటికి వెళుతున్న రేబర్తి సర్పంచ్ అందె భూపతిని దారి కాచి మండలపరిషత్ కార్యాలయంలో ఎక్కువగా మాట్లాడావని వంగపల్లి గ్రామానికి చెందిన దొంతి రాజిరెడ్డి, దొంతి బుచ్చిరెడ్డితో పాటు సీపీఎం మండలపార్టీ కార్యదర్శి ఆలేటి యాదగిరిలు కులం పేరుతో అసభ్య పద జాలంతో దూషించారన్నారు. తనను కులంపేరుతో అసభ్యంగా దూషించారని అందె భూపతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సీఎస్టీ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ప్రతి లెక్క పక్కాగా ఉండాలి

• జిల్లా పంచాయతీ అధికారి సురేష్‌బాబు



సమీక్ష నిర్వహిస్తున్న డీపీవో సురేష్‌బాబు

జగదేవ్‌పూర్: గ్రామ పంచాయతీ ద్వారా ఖర్చు అవుతున్న ప్రతి రూపాయికి లెక్క పక్కాగా ఉండాలని జిల్లా పంచాయతీ అధికారి, డీఆర్‌డీఏ ఇన్‌చార్జి పీడీ సురేష్‌బాబు అన్నారు. శనివారం జగదేవ్‌పూర్ మండలపరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీ, గ్రామ పంచాయతీలు, హరితాహారంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీలో జరిగే ఖర్చులకు సంబంధించి లెక్కలన్నీ పక్కాగా చూసుకోవాలని కార్యదర్శులకు సూచించారు. 14వ ఫైనాన్స్ నిధులు సక్రమంగా వినియోగించాలన్నారు. రికార్డులు, చెక్‌బుక్‌లు అప్‌డేట్ చేసుకోవాలన్నారు. గ్రామపంచాయతీ పరిధిలోని ఆస్తులన్నింటికీ ట్యాగింగ్ చేయాలన్నారు. ఇకనుంచి ఇంటి పన్నులన్నీ ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని డీపీవో సురేష్‌బాబు సూచించారు. ఇప్పటికే చాలా గ్రామపంచాయతీల్లో ఇంటిపన్నులు ఆన్‌లైన్‌లో నమోదు చేయడం జరిగిందన్నారు. ఈజీఎస్ పథకం ద్వారా ప్రతి గ్రామంలో రూ.30నుంచి 40లక్షల అభివృద్ధి పనులు పూర్తి చేయాలన్నారు.ఎంపీడీవో పట్టాభిరామారావు, ఈజీఎస్ ఏపీవో శ్యాంసుందర్‌రెడ్డి, గ్రామ పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాస్, రాఘవేందర్, నరేందర్, రాధ, మౌన, స్వప్న, తిరుపతి, ఎఫ్ఏలు, టీఏలుఉన్నారు.

'కుమ్మరుల సమస్యలను పరిష్కరిస్తా'



శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న నాయకులు

సిద్ధిపేట కల్చరల్: కుమ్మరుల సమస్యలను పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని ఎంబీసీ చైర్మన్ తాడూరి శ్రీనివాస్ హామీయిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా కుల వృత్తులపై ఆధారపడిన కుల సంఘాల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కరిస్తానని హామీనిచ్చారు. శనివారం ఎంబీసీ చైర్మన్ తాడూరి శ్రీనివాస్ ను తెలంగాణ బీసీ బహుజన సంక్షేమ సంఘం సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు కట్కూరి రవీందర్, నాయకులు హైదరబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసి కుమ్మరులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై వినతిపత్రం అందించారు. సంఘం నాయకులు భూ మయ్య, రామచంద్రం, శ్రీనివాస్, వెంకట్, రాజు, రాము, నాగరాజు పాల్గొన్నారు.

దుబ్బాక బడిలో

బియ్యంలో పురుగులు



బియ్యంలో పురుగులు, తెట్టెలు

దుబ్బాక: రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులు నాణ్యమైన సన్నబియ్యంతో భోజనాన్ని అందించాలని చూస్తుంటే అధికారులు మాత్రం నిర్లక్ష్యం వహిస్తున్నారు. శనివారం మండల కేంద్రమైన దుబ్బాకలో సీఎం కేసీఆర్ చదువుకున్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని సన్న బియ్యంలో పురుగులు, తెట్టెలు రావడంతో అక్కడికి చేరుకున్న మండల విద్యాధికారి వెంకటయ్య ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. సివిల్‌సప్లై నుంచి వచ్చే బియ్యాన్ని ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. ప్రధానోపాధ్యాయుడి నిర్లక్ష్యంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తెట్టెలు, పురుగుల వచ్చిన బియ్యాన్ని తిరిగి సివిల్‌సప్లై గోదాంకు పంపించాలని ఎంఈఓ వెంకటయ్య ఆదేశించారు.

ఇద్దరు దొంగల అరెస్ట్

• 6తులాల బంగారం స్వాధీనం

• రిమాండ్‌కు తరలించిన పోలీసులు



నిందితులతో ఏసీపీ నర్సింహారెడ్డి

సిద్ధిపేట క్రైం: జల్సాలకు, చెడు వ్యసనాలకు బానిసలై సులభంగా డబ్బులు సంపాదించాలన్న ఉద్దేశ్యంతో దొంగతనమే మార్గంగా ఎంచుకున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసిన సంఘటన సిద్దిపేట పట్టణంలో జరిగింది. ఇందుకు సంబంధించిన వివరాలను శనివారం విలేకరుల సమావేశంలో ఏసీపీ నర్సింహారెడ్డి వెల్లడించారు. సిద్దిపేట పట్టణంలోని భారత్‌నగర్‌కు చెందిన బంగారి అనిల్, విజయ్ లు జల్సాలకు అలవాటు పడి తాళం వేసిన ఇంట్లో చొరబడి బంగారు అభరణాలు, నగదు దొంగిలించారని తెలిపారు. జనవరిలో టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆదర్శనగర్‌లో బెజుగామ లింగమూర్తి ఇంట్లో పగటిపూట ఈ ఇద్దరు వ్యక్తులు కలిసి ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలోని బంగారు, వెండి వస్తువులను, నగదును దొంగిలించారన్నారు. ఈ వస్తువులను అమ్ముకొనుటకు కరీంనగర్ వెళ్తుండగా నర్సాపూర్ చౌరస్తాలో అనుమానస్పదంగా సంచరిస్తుండగా సీఐ ఆంజనేయులు అదుపులోకి తీసుకొని విచారించగా నేరం ఒప్పుకున్నారని తెలిపారు. వీరి వద్ద నుంచి 6 తులాల బంగారం, 5 తులాల వెండి వస్తువులను స్వాధీన పరుచుకొని నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

రైతుబజార్‌లో ఎలక్ట్రానిక్ తూకాలు వినియోగించేలా చర్యలు

● జాయింట్ కలెక్టర్ పద్మాకర్



రైతు బజార్ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న జేసీ పద్మాకర్

సిద్ది పేట కల్చరల్ : వినియోగదారుల విజ్ఞప్తి మేరకు రైతుబజార్‌లో ఎలక్ట్రానిక్ తూకాలను వినియేగించాలా చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ పద్మాకర్ అధికారులను ఆదేశించారు. శనివారం సిద్దిపేటలో తాత్కాలిక రైతుబజార్‌ను ఆయన సందర్శించారు. ఇటీవల కురిసిన వర్షానికి మార్కెట్‌లో గుంతలు ఏర్పడటంతో వాటిని వెంటనే పూడ్చివేయాలని అధికారులను ఆదేశించారు. తూకాలలో అనుమానాలున్నట్లు వినియోగదారులు జేసీ దృష్టికి తీసుకురావడంతో జిల్లా లీగల్ మెట్రాలజీ అధికారి పిలిపించి అన్ని తూకాలకు సీల్, స్టాంపింగ్ వేయించి మూడు రోజుల్లో నివేదిక అందించాలని ఆదేశించారు. రైతుల విజ్ఞప్తి మేరకు తాగునీరు తగినంత సరఫరా చేయాలని రైతుబజార్ ఈవో ప్రభాకర్‌ను ఆదేశించారు. రైతులందరికీ ఐడీ కార్డులు జారీ చేయాలని, మార్కెట్‌లో కూరగాయల ధరలు నిర్ణయించే ముందు రైతులతో సంప్రదించి, నిబంధనల ప్రకారం ధర నిర్ణయించాలని సూచించారు. అనంతరం నూతనంగా నిర్మిస్తున్న రైతుబజార్ భవన నిర్మాణ పనులను జేసీ పరిశీలించారు. జేసీ వెంట జిల్లా మార్కెటింగ్ అధికారి నాగేశ్వరశర్మ, జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటేశ్వర్లు, తహసీల్దార్ పరమేశ్వర్, మార్కెటింగ్ ఏఈ మహేందర్ తదితరులు ఉన్నారు.

నేటి నుంచి ఇంటింటికీ హరితహారం

● మర్కూక్, పాములపర్తి నుంచి స్వీకారం
● ఇంటింటికీ పండ్లు, పూల మొక్కలు
● గడ ప్రత్యేకాధికారి హన్మంతరావు



పాములపర్తిలో పనులను పరిశీలిస్తున్న హన్మంతరావు

వర్గల్/మర్కూక్ : ఇంటింటికీ మొక్కలను నాటే కార్యక్రమం ఆదివారం నుంచి మర్కూక్ మండలకేంద్రంతో పాటు పాములపర్తి నుంచి స్వీకారం చుట్టనున్నట్లు గడ ప్రత్యేకాధికారి హన్మంతరావు తెలిపారు. పాములపర్తిలో కొనసాగతున్న అభివృద్ధి పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ ఇంటింటికీ మొక్కలు నాటే కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటికీ పండ్లు, పూలు, నీడనిచ్చే 12 మొక్కల చొప్పున అందజేస్తామన్నారు. బాదం, మామిడి, జామ, ఉసిరి, సీతాఫల్, పనస, దానిమ్మ, అల్లనేరెడు, కరివేపాకు, బొప్పాయి, సపోట, బోడ్డుమల్లె, మందారం, సంపంగి, గన్నేరు, బోహనీయా వంటి 16 రకాల మొక్కలను అందజేయనున్నట్లు తెలిపారు. మొక్కలను ఇంటి ఎదుట ఉన్న ఖాళీ స్థలంలో, ఇంటి ఆవరణలో నాటుకోవాలన్నారు. ఇళ్లతో పాటు గ్రామంలో ఉన్న ఖాళీ స్థలంలో, అంతర్గత వీదులో మొక్కలు నాటడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీవో సురేష్‌బాబు, ఫారెస్టు అధికారులు రామరావు, కిరన్, ఎంపీడీవో శ్రీనివాస్, ఈవోపీఆర్‌డీ స్వర్ణకుమారి, ఈజీఎస్ ఏపీఎం నాగలక్ష్మీ, పంచాయతీ కార్యదర్శి వికాస్, నాయకులు కనకయ్య, రాజేశ్‌తో పాటు వివిధ శాఖల అధికారులు, గ్రామస్థులు ఉన్నారు.

తపాస్‌పల్లి రిజర్వాయర్‌కు జలకళ

● గోదావరి జలాల పంపింగ్
● భారీగా చేరిన నీరు
● చెరువుల్లోకి మళ్లింపునకు సన్నాహాలు
● అన్నదాతల హర్షం



నీటితో కళకళలాడుతున్న తపాస్‌పల్లి రిజర్వాయర్

చేర్యాల : దేవాదుల ఎత్తిపోతల పథకం రెండో దశ ద్వారా కొమురవెల్లి మండలం ఐనాపూర్ - తపాస్‌పల్లి గ్రామాల శివారులో నిర్మించిన రిజర్వాయర్ జలకళను సంతరించుకుంది. కొద్ది రోజులుగా గోదావరి జలాలు పంపింగ్ చేస్తుండటంతో రిజర్వాయర్‌లోకి నీరు భారీగా చేరుతోంది.

చాలా సంవత్సరాలుగా సంమృద్ధిగా వర్షాలు కురవకపోవడంతో భూగర్భ జలాలు 600 అడుగులలోతుకు పడిపోయాయి. రైతులు వ్యవసాయానికి స్వస్తి పలికి ఉపాధి నిమిత్తం వలసలు వెళ్లారు. ఈ నేపథ్యంలో సాగునీటిని అందించాలని ఆందోళనలు చేపట్టగా కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రిజర్వాయర్ నిర్మాణానికి అంకురార్పణ చేశారు. సముద్రమట్టానికి 540 అడుగుల ఎత్తులో ఉన్న ప్రదేశమైన తపాస్‌పల్లి - ఐనాపూర్ గ్రామాలను గుర్తించి జలయజ్ఞంలో దేవాదుల పథకం ద్వారా 0.3 టీఎంసీ సామర్థ్యంతో రిజర్వాయర్‌ను నిర్మించేందుకు 2006లో రూ.8 కోట్ల నిధులను మంజూరు చేసింది. కుడి, ఎడమ కాలువల ద్వారా 69 వేల ఎకరాలకు సాగునీటినందించేందుకు పథకాన్ని రూపొందించారు. 2007 మే 4న ముగ్గురు మంత్రులు అప్పటి భారీ నీటిపారుదలశాఖ మంత్రి పొన్నాల లక్ష్మయ్య, హోంశాఖ మంత్రి కుందూరు జానారెడ్డి, గిరిజన, సంక్షేమశాఖ మంత్రి రెడ్యానాయక్‌లు ఈ రిజర్వాయర్ నిర్మాణానికి శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. 2013 ఆగస్టు 25న అప్పటి భారీనీటిపారుదల శాఖామంత్రి పొన్నాల లక్ష్మయ్య ప్రత్యేక శ్రద్ధతో రిజర్వాయర్‌లోకి నీటి పంపింగ్‌ను ప్రారంభించారు. కానీ చెరువుల్లోకి మళ్లించే చర్యలు చేపట్ట లేదు. తెలంగాణ రాష్ట్రావతరణ అనంతరం సీఎం కేసీఆర్ సహకారంతో ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి చెరువులకు మళ్లింపునకు శ్రీకారం చుట్టారు. కరువు పీడిత ప్రాంతమైన చేర్యాలకు తపాస్‌పల్లి రిజర్వాయర్ వరప్రదాయినిగా నిలిచింది. రైతులకు భరోసానిచ్చింది.

భూగర్భజలాల పెంపునకు దోహదం

రిజర్వాయర్‌లో గోదావరి జలాలు నిల్వచేయడంతో భూగర్భజలాల మట్టం పెంపొందుతాయని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వరంగల్ జిల్లాలో కొనసాగిన సమయంలో చేర్యాలలోనే రైతుల ఆత్మహత్యలు అధికంగా కొనసాగాయి. దీంతో ప్రభుత్వ చొరవతో రిజర్వాయర్ నుంచి రెండేళ్లుగా కాలువల ద్వారా చేర్యాల, మద్దూరు, బచ్చన్నపేట మండలాల్లోని చెరువులకు నీటిని మళ్లిస్తున్నారు. దీంతో రైతులు కాస్త ఊరట చెందుతున్నారు. పదిరోజులుగా రిజర్వాయర్‌లోకి ఒకే పైపులైన్ ద్వారా నీటిని పంపింగ్ చేస్తుండటంతో నీటిమట్టం పెరుగుతుంది. మరికొద్ది రోజులలో రెండో పైపులైన్‌ను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. దీంతో తక్కువ సమయంలోనే రెట్టింపు నీరు నిల్వ చేసి రానున్న రోజులలో గ్రామాల్లోని చెరువులకు మళ్లించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. అంతేకాకుండా కొండపాక, గజ్వేల్ మండలాలకు నీటిని మళ్లించేందుకు కాలువ నిర్మాణం పనులను వేగవంతం చేశారు. రెండో పంపింగ్‌నూ త్వరలో ప్రారంభించనున్నట్లు అధికారులు చెబుతున్నారు. సాగుకు నీటి కష్టాలు తీరనున్నాయని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

సందర్శకుల తాకిడి

రిజర్వాయర్ జలకళ సంతరించుకోవడంతో సందర్శకుల తాకిడి రోజురోజుకూ పెరుగుతుంది. నిత్యం సమీప ప్రాంతాలకు చెందిన ప్రజలు తరలివస్తున్నారు. అంతేకాకుండా సమీపంలోనే కొమరవెల్లి మల్లికార్జునస్వామి ఆలయం, నాగపురి కొండపోచమ్మ ఆలయాలు ఉండడంతో ఆలయాల దర్శనార్థం వచ్చే భక్తులు ఆహ్లాదం కోసం రిజర్వాయర్‌కు వస్తున్నారు. రిజర్వాయర్ వద్ద చిరువ్యాపారులు దుకాణాలు ఏర్పాటు చేసుకోవడంతో సందడిగా నెలకొంది.

కూరగాయల సాగులో జిల్లాను నంబర్‌వన్‌గా నిలుపుతాం

● ఉద్యానవన సాగుపై సీఎం, మంత్రి హరీశ్‌రావు ప్రత్యేక దృష్టి
● రాష్ట్ర ఉద్యానవనశాఖ కమిషనర్ వెంకట్రామారెడ్డి

గజ్వేల్‌అర్బన్/ములుగు: కూరగాయల సాగులో సిద్దిపేట జిల్లాను దేశంలోనే నంబర్‌వన్‌గా నిలిపేందుకు కృషి చేస్తున్నామని రాష్ట్ర ఉద్యానవనశాఖ కమిషనర్ వెంకట్రామారెడ్డి అన్నారు. గజ్వేల్ నియోజకవర్గంలోని ములుగు మండల కేంద్రంలో సెంటర్ ఫర్ ఎక్సలెన్సీని ఆయన శనివారం పరిశీలించారు. అనంతరం గజ్వేల్ మండల పరిధిలోని ప్రజ్ఞాపూర్ రాజీవ్ రహదారి పక్కన ఏర్పాటు చేసిన రైతు మార్కెట్‌లో మహిళా రైతులతో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు బజార్లలో రైతులే నేరుగా తమ పంటలను విక్రయించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ క్రమంలో ఇప్పటికే 14 రైతుబజార్లను పరిశీలించినట్లు తెలిపారు. మధ్యవర్తుల ప్రమేయంపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తానని తెలిపారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా గజ్వేల్‌లో రైతు మార్కెట్‌ను మంత్రి ప్రత్యేక చొరవతో ఏర్పాటు చేయించడం హర్షణీయమన్నారు. మొబైల్ మార్కెట్‌లు రాష్ట్రంలో చాలా చోట్ల అవసరమున్నాయని తెలిపారు. రాష్ట్రంలో కూరగాయల సాగును ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.1300 కోట్ల బడ్జెట్‌ను ఉద్యానవన శాఖకు కేటాయించామని తెలియజేశారు. సిద్దిపేట జిల్లాలో ఉద్యానవన సాగును ప్రోత్సహించేందుకు ప్రత్యేకంగా కోటి రూపాయలను మంత్రి హరీశ్‌రావు ఆదేశాల మేరకు కేటాయించామని తెలిపారు. ఇప్పటికే రాష్ట్రంలో పందిరి సాగు, డ్రిప్ సాగులో రాష్ట్రంలోనే సిద్దిపేట జిల్లా అగ్రస్థానంలో నిలిచిందని, దేశంలోనే అగ్రస్థానంలో నిలిపేందుకు కృషి చేస్తున్నట్లు కమిషనర్ తెలిపారు.



మహిళా రైతులతో మాట్లాడుతున్న కమిషనర్ వెంకట్రామారెడ్డి, డీడీ రామలక్ష్మి

నాణ్యమైన నారును అందజేస్తాం

ములుగు మండల కేంద్రంలోని హార్టికల్చర్ యునీవర్సిటీ పక్క స్థలంలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ ద్వారా రైతులకు నాణ్యమైన నారును అంద జేస్తామని తెలిపారు. టమాట, వంకాయ, మిర్చి నారు సాగుచేసి ఏప్రిల్, మే, జూలై మాసాల్లో రైతులకు అందుబాటులో ఉంచుతామన్నారు. 50 ఎకరాల్లో నారుమళ్లను సాగుచేస్తున్నామని, వీటిపై ఈ ప్రాంత రైతులకు అవగాహన కల్పిస్తామన్నారు. అంతేకాకుండా ఆయా రకాల నారు నర్సరీని ఏర్పాటు చేసేందుకు రెండు ఎకరాలకు ఒకటి చొప్పున ఆరు షెడ్‌లు ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. పాతూర్ గ్రామంలో 150 మంది రైతులను గుర్తించామని, వారిలో ఎస్సీ, ఎస్టీలకు 90 శాతం సబ్సిడీ, బీసీలకు 80 శాతం సబ్సిడీ, ఇతరులకు 70 శాతం సబ్సిడీపై డ్రిప్, ఇతర పరికరాలను అందించేందుకు కసరత్తు చేస్తున్నామన్నారు. రైతు మార్కెట్‌లో మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామని అన్నారు. రెస్టరూమ్ నిర్మించాలని, షెడ్‌లను మరింతగా విస్తరించాలని రైతులు కోరినట్లు తెలిపారు. ఈ విషయాన్ని మంత్రి హరీశ్‌రావు దృష్టికి తీసుకెళ్లనున్నట్లు చెప్పారు. ఆయనవెంట ఉద్యానవన శాఖ జిల్లా అధికారి రామలక్ష్మి, మార్కెట్ కార్యదర్శి వెంకట్‌రాహుల్, కిరణ్ తదితరులున్నారు.

గడ ప్రత్యేకాధికారి సుడిగాలి పర్యటన

● వర్షంలోనూ అభివృద్ధి పనుల పరిశీలన
● డబుల్ ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలి
● ఎడ్యుకేషన్ హబ్ నిర్మాణ పనులపై అసంతృప్తి

గజ్వేల్‌అర్బన్: గడ ప్రత్యేకాధికారి హనుమంతరావు శనివారం అభివృద్ధి పనుల పరిశీలనకు సుడిగాలి పర్యటన నిర్వహించారు. గజ్వేల్ పట్టణంలోని డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం, ఎడ్యుకేషన్ హబ్, వంద పడకల ఆసుపత్రి, వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ నిర్మాణ పనులను వర్షంలోనే పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఎడ్యుకేషన్ హబ్ నిర్మాణ పనులు జరుగుతున్న తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పనులను వేగవంతంగా చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలను విజయదశమిలోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. దసరాకు గృహ ప్రవేశాలు జరిగేలా నిర్మాణాలను మొదటి ప్రాధాన్యం కింద పూర్తిచేయాలన్నారు. అంతేకాకుండా గజ్వేల్ పట్టణంలో దశాబ్దాల కల వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ పనులను ఆయన పరిశీలించారు. పనులను త్వరితగతిన ప్రారంభించాలని సిబ్బందిని ఆదేశించారు. కూరగాయల విక్రయదారుల నిమిత్తం 250 దుకాణాలు, నాన్‌వెజ్ నిమిత్తం 40 దుకాణాలు, 50 పండ్ల దుకాణాలను ఏర్పాటు చేసేలా దుకాణాలను నిర్మిస్తున్నామని ఆయన తెలిపారు. ఆయన వెంట ఆయా శాఖల అధికారులు తదితరులున్నారు.



వర్షంలో మార్కెట్‌ను పరిశీలిస్తున్న హన్మంతరావు

సీఎం నియోజకవర్గ రైతులకు నోటీసులా ?

- ఇదేనా వ్యవసాయ రుణమాఫీ
- వారం రోజుల్లో స్పందించకుంటే ఆందోళన చేస్తాం
- తెలుగు రైతు రాష్ట్ర అధ్యక్షుడు వంటేరు ప్రతాప్‌రెడ్డి


రైతులతో కలసి విలేకరులతో మాట్లాడుతున్న ప్రతాపరెడ్డి

గజ్వేల్‌అర్బన్ : సీఎం నియోజకవర్గంలోని రైతులకే బ్యాంకులు నోటీసులు అందజేశాయి, ఇదేనా వ్యవసాయ రుణమాఫీ అని తెలుగు రైతు రాష్ట్ర అధ్యక్షుడు వంటేరు ప్రతాప్‌రెడ్డి ప్రశ్నించారు. రైతు రుణమాఫీని పకడ్బందీగా అమలు చేయాలని గజ్వేల్ మండల పరిధిలోని అక్కారం గ్రామంలో బ్యాంకు నుంచి పంట రుణాలకు సంబంధించిన నోటీసులు అందుకున్న రైతులతో కలసి ఆయన విలేకరులతో మాట్లాడారు. అక్కారం, కోనాపూర్, శ్రీగిరిపల్లి, దాతర్‌పల్లి, గణేష్‌పల్లి, తీగుల్ గ్రామాలకు సంబంధించిన రైతులకు ప్రభుత్వం అందించిన రుణమాఫీ అందకపోవడంపై సీఎం, జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. రైతు రుణాలు మాఫీ చేశామని ప్రభుత్వం గొప్పగా ప్రకటించుకుంది కానీ ఈ గ్రామాల ప్రజలకు బ్యాంకుల నుంచి నోటీసులు అందడం ఏమిటని ప్రశ్నించారు. రాష్ట్రంలోని అనేక మంది అర్హత కలిగిన రైతులకు రుణమాఫీ అందలేదని వారిని గుర్తించి రుణమాఫీ చేసి ఆదుకోవాలని కోరారు. ప్రభుత్వం వారం రోజుల్లోగా స్పందించని పక్షంలో రైతులతో కలసి గజ్వేల్ ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామన్నారు. ఆయన వెంట టీడీపీ మండలాధ్యక్షుడు బొల్లారం ఎల్లయ్య, నాయకులు వెంకటేశ్, రైతులు తదితరులున్నారు.

ప్రజల హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వం

- టీజేఏసీ జిల్లా చైర్మన్ బాపురావు



ఢిల్లీకి వెళ్తున్న సిద్దిపేట జిల్లా టీజేఏసీ నాయకులు

సిద్దిపేట రూరల్ : అరవై ఏళ్ల పోరాట ఫలితంగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలో అధికారం చేపట్టిన టీఆర్‌ఎస్ పార్టీ ప్రజల హక్కులను కాలరాస్తుందని టీజేఏసీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు ఎ.బాపురావు అన్నారు. టీజేఏసీ రాష్ట్ర కమిటి పిలుపు మేరకు శనివారం సిద్దిపేట కమిటీ నాయకులు ఛలో ఢిల్లీ కార్యక్రమానికి తరలివెళ్లారు. అంతకుముందు సిద్దిపేటలో వారు విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో జరుగుతున్న అరాచక పాలనను జాతీయస్థాయిలో చర్చించేందుకు టీజేఏసీ చలో ఢిల్లీ కార్యక్రమానికి పిలుపునిచ్చిందన్నారు. టీజేఏసీ జిల్లా కో చైర్మన్ శ్రీనివాస్, కో కన్వీనర్ శివకమార్, కో ఆర్డీనేటర్ శ్రీనివాస్, నాయకులు తరలివెళ్లారు.

తుగ్లక్‌ను తలపిస్తున్న కేసీఆర్ పాలన

అక్కన్నపేట: ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తూ ప్రజల గొంతు నొక్కుతున్న సీఎం కేసీఆర్ పాలన తుగ్లక్‌ను తలపిస్తుందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కొయ్యడ సృజన్‌కుమార్ అన్నారు. శనివారం అక్కన్నపేట మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇందిరాపార్కు వద్ద ఉన్న ధర్నా చౌక్‌ను ఎత్తివేయొద్దని 21న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిర్వహించే ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సృజన్‌కుమార్ పిలుపు నిచ్చారు.

పంటకు జీవం

- హమ్మయ్య.. వర్షం కురిసింది
- మురిసిన అన్నదాతలు
- జిల్లా అంతటా వరుణుడి కటాక్షం
- అన్ని మండలాల్లో మోస్తరు వానలు
- చెరువులు, కుంటలకు జలకళ
- తొలిసారిగా రోజంతా వర్షం
- 49 మి.మీ. వర్షపాతం నమోదు

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట : వరుణుడి చల్లనిచూపుతో సిద్దిపేట జిల్లా తడిసిముద్దయ్యింది. ఈ సీజన్‌లో తొలిసారిగా రోజంతా వర్షం పడింది. శనివారం తెల్లవారుజాము నుంచి రాత్రి దాకా ఎడతెరిపిలేకుండా మోస్తరుగా వాన కురిసింది. జీవం పోయేలా ఉన్న పంటలకు ప్రాణం లేచొచ్చినట్లయ్యింది. వర్షాన్ని చూసి అన్నదాతలు మురిసిపోయారు.

రోజంతా ఎడతెరిపి లేకుండా

తొలకరిలో వ్యవసాయానికి అనుకూలంగానే వర్షాలు పడ్డాయి. అయితే చిరుజల్లుల రూపంలోనే గంటల కొద్దీ వర్షం పడిందే తప్ప భారీ వర్షాలు పడలేదు. ఇక జూలై నెలలో వరుణ దేవుడు పూర్తిగా మొఖం చాటేశాడు. కీలకమైన ఆగస్టులో వర్షాలు లేక మొక్కజొన్న, పత్తి పంటలు దెబ్బతిన్నాయి. జూన్ నెలలో 105 మి.మీ సాధారణ వర్షపాతానికి 248 మి.మీ వర్షపాతం నమోదైంది. అదే విధంగా జూలై నెలలో 213 మి.మీ సాధారణ వర్షపాతానికి 149మి.మీ వర్షపాతమే నమోదైంది. ఇక ప్రస్తుత నెలలో పదిహేను రోజుల నుంచి సరైన వర్షం లేకపోవడంతో పంటలన్నీ ఎండుదశకు చేరుకున్నాయి. శనివారం కురిసిన వానతో 49మి.మీ వర్షపాతమే నమోదైంది. రోజంతా వర్షం ఉండడంతో ఇది రెట్టింపయ్యే అవకాశం ఉంది. వాస్తవానికి ఈ నెలలో 125 మి.మీ సాధారణ వర్షపాతం నమోదు కావాలి.

తడిసిముద్దయిన సిద్దిపేట జిల్లా

తొలిసారిగా జిల్లా అంతటా వర్షం కురిసింది. ఇంతకుముందు గజ్వేల్ ప్రాంతంలో వర్షం ఉంటే సిద్దిపేటలో సాధారణ పరిస్థితి ఉండేది. పక్కపక్క గ్రామాల్లోనూ వాతావరణం సమతుల్యంగా ఉన్న దాఖలాలు లేవు. అయితే వీటికి భిన్నంగా జిల్లాలోని అన్ని మండలాల్లో శనివారం ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. సిద్దిపేట అర్బన్, సిద్దిపేట రూరల్, కొండపాక, గజ్వేల్, హుస్నాబాద్, కోహెడ, అక్కన్నపేట, వర్గల్, ములుగు, జగదేవపూర్, బెజ్జంకి, నంగునూరు, చిన్నకోడూరు మండలాల్లో మోస్తరుగా కురిసింది. ఇక ఇతర మండలాల్లో చిరుజల్లులే ఉన్నప్పటికీ రోజంతా ఎడతెరిపి లేకుండా, రాకపోకలు స్తంభించేలా కురిసింది.


లింగారెడ్డిపల్లిలో వరి పొలంలో చేరిన నీరు

అన్ని పంటలకు ఆసరాగా

పెట్టుబడులు పెట్టి వర్షం కోసం ఎదురుచూస్తున్న రైతులకు ప్రతిసారీ ఆశించిన స్థాయిలో ఫలితం దక్కడం లేదు. చిరుజల్లులతోనే సంతృప్తి పడాల్సి వస్తోంది. మొదటిసారిగా ప్రభావమంతమైన వర్షం పడిందని రైతులే సంతోషిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా దాదాపు 4 లక్షల పైచిలుకు ఎకరాల్లో వివిధ పంటలు వేశారు. ఈసారి అత్యధికంగా 1,83,616 ఎకరాల్లో పత్తి సాగు చేయగా, 1,56,489 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశారు. ఇక సుమారు 70వేల ఎకరాల్లో వరి పంట విస్తీర్ణం ఉంది. ఇంకా పెరిగే అవకాశాలు కూడా ఉన్నాయి. ఆగస్టు నెలాఖరు వరకు కూడా వరి సాగుకు అనుకూలంగా ఉంటుందని అధికారులు సూచిస్తున్నారు. ఇక దాదాపు 10వేల ఎకరాల్లో కంది పంటతోపాటు ఇతర తృణధాన్యాలు, కూరగాయల పంటలు వేశారు. వర్షాలు లేక పత్తి, మొక్కజొన్న పంటలు నేలవాలే పరిస్థితి ఉండడంతో రైతులు ప్రత్యామ్నాయం గురించి కూడా ఆలోచించారు. అయినా ఫలితం లేక వాలిపోతున్న పంటలు చూసి ఆత్మహత్యలు కూడా చేసుకున్న పరిస్థితి జిల్లాలో నెలకొంది. తాజాగా కురిసిన వర్షంతోపాటు మరో రెండు రోజులు ఇదే పరిస్థితి ఉండాలని అన్నదాతలు ఆకాంక్షిస్తున్నారు.

వర్షంపై మంత్రి హరీశ్ ఆరా



సిద్దిపేట జిల్లాలో కురుస్తున్న వర్షం గురించి శనివారం మంత్రి హరీశ్‌రావు ఆరా తీశారు. ఎడతెరిపిలేకుండా తొలిసారి పడుతున్న వానల పరిస్థితిపై పలువురిని అడిగి తెలుసుకున్నారు. సిద్దిపేట నియోజకవర్గంతోపాటు జిల్లాలోని పలు చెరువుల్లోకి నీళ్లు చేరుతున్నాయా.. లేదా అనే విషయంపై సంబంధిత అధికారులతో మాట్లాడారు. సిద్దిపేటలోని నర్సాపూర్ చెరువును ఇటీవల అభివృద్ధి చేయగా తాజా వర్షం నేపథ్యంలో చెరువు పరిస్థితి గురించి 'ఎస్ఎఫ్ఎన్ - సిద్దిపేట' అనే వాట్సప్ గ్రూప్‌లో ఆరా తీశారు. నీటి పారుదల శాఖ అధికారి విష్ణుతో పాటు కౌన్సిలర్ మచ్చ వేణుగోపాల్‌రెడ్డి, యువజన నాయకుడు శేషు స్పందించారు. వెంటనే నర్సాపూర్ చెరువు ఫోటోను గ్రూప్‌లో పోస్టు చేశారు. పట్టణంలోని పలు కాలువల నుంచి ఉప్పొంగుతున్న నీటి ప్రవాహంతో చెరువు నిండే పరిస్థితి ఉన్నదని పేర్కొన్నారు. అదే విధంగా వ్యవసాయశాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ఎప్పటికప్పుడు రైతులకు సలహాలు, సూచనలు ఇవ్వాలని ఆదేశించినట్లు తెలిసింది. అంతేకాకుండా లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, జిల్లా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు.

జగ్గారెడ్డీ.. నీ నాటకాలు ఇక సాగవు !

- ఎమ్మెల్సీ ఫారూఖ్‌హుస్సేన్

దుబ్బాక: మెడికల్ కళాశాల ఏర్పాటు విషయంలో జగ్గారెడ్డి దొంగ నాటకాలు ఇక్కడ సాగవని, ఒకరేమో కరీంనగర్‌లో, మరొకరేమో సంగారెడ్డిలో కావాలంటారని ఎమ్మెల్సీ ఫారూఖ్‌హుస్సేన్ మండిపడ్డారు. శనివారం ఆయన దుబ్బాకలోని డీసీఎంఎస్ డైరెక్టర్ గుండబోయిన వెంకటేశ్వర్లు నివాసంలో మాట్లాడారు. టీఆర్ఎస్ కోవర్టుగా కాంగ్రెస్‌లో చేరిన జగ్గారెడ్డి తెలంగాణ ఉద్యమానికి తూట్లు పొడిచారన్నారు. రాజకీయ జీవితం ఇచ్చిన తెలంగాణ ఉద్యమాన్ని అమ్ముకుని ముగ్గురు ఆంధ్ర సీఎంల పంచన చేరినపుడు సంగారెడ్డిలో మెడికల్ కళాశాల ఏర్పాటు చేయాలనే సోయి ఎందుకు లేదని మండిపడ్డారు. అధికారంలో ఉండగా భూకబ్జాలకే పాల్పడి సంగారెడ్డి ప్రజలకు ఒరగబెట్టిందేమిటో చెప్పాలన్నారు. ఒకవైపు కరీంనగర్ జిల్లాలో మెడికల్ కళాశాల మంజూరైందని యాగి చేసే పొన్నం ప్రభాకర్, లేదు సంగారెడ్డికి మంజూరైందని నాటకాలు ఆడే జగ్గారెడ్డిలలో ఎవరి మాటలు నిజమని ప్రశ్నించారు. ఒకే కళాశాలను రెండు చోట్ల ఎలా మంజూరు చేయించారో కాంగ్రెస్ నేతలు చెప్పాలన్నారు. సంగారెడ్డిలో ప్రజల మధ్య ఉండే నాయకుడు చింతా ప్రభాకర్‌ను ఎదుర్కొనే శక్తిలేక, బీసీ, మైనార్టీల పక్షనా నిలిచే ఎమ్మెల్యే ప్రజారణను తట్టుకోలేక జగ్గారెడ్డి ఉనికి కోసం ఇవన్నీ చేస్తున్నారన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వంలో ఆయన ఆటలు సాగవని, భూకబ్జాలను త్వరలోనే వెలికి తీస్తామన్నారు. అభివృద్ధి కోసమే తాను కాంగ్రెస్‌లో చేరినా అని చెప్పుకున్న ఆయన వందల కోట్లు ఎలా కూడబెట్టారని ప్రశ్నించారు. ఇలాంటి వ్యక్తి టీఆర్ఎస్ పాలనపై ఆరోపణలు చేయడం దారుణమన్నారు. తమ ప్రభుత్వానికి గొప్ప విజన్ ఉందన్నారు. అభివృద్ధి గురించి జగ్గారెడ్డితో చెప్పించుకునే స్థితిలో తాము లేమన్నారు. సిద్దిపేటకు మెడికల్ కళాశాల వద్దని జగ్గారెడ్డి ఆందోళన చేస్తే, సిద్దిపేట కాంగ్రెస్ నాయకులు ఆయనకు మద్దతు ఇవ్వడం సిగ్గుచేటన్నారు. నిద్రాహారాలు మాని పనిచేసే మంత్రి హరీష్‌రావు నాయకత్వంలో ఉమ్మడి మెదక్ జిల్లా పురోభివృద్ధి సాధించి తీరుతుందన్నారు. త్వరలోనే జగ్గారెడ్డిలాంటి నాయకులకు, ప్రజాద్రోహులకు ప్రజాక్షేత్రంలోనే శిక్షించి తీరుతామన్నారు. ఆయన వెంట నాయకులు సికిందర్, గుండబోయిన వెంకటేశ్వర్లు, బిజ్జ సత్తయ్య, ఆకుల దేవేందర్, రఫీ తదితరులున్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఫారూఖ్‌హుస్సేన్

పనులు ప్రారంభించని కాంట్రాక్టర్ల డిపాజిట్లు జప్తు చేయండి

- స్థాయీ సంఘ సమావేశంలో సభ్యుల మండిపాటు


మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ రాజమణి

సంగారెడ్డి టౌన్ : జిల్లాలో ప్రభుత్వం మంజూరు చేసిన అభివృద్ధి పనులను ప్రారంభించని కాంట్రాక్టర్ల డిపాజిట్లును జప్తు చేసి బ్లాక్ లిస్టులో పెట్టాలని పలువురు సభ్యులు కోరారు. సంగారెడ్డిలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో జడ్పీచైర్‌పర్సన్ రాజమణి మురళీయాదవ్ అధ్యక్షతన నిర్వహించిన ఏడో స్థాయీ సంఘం (పనులు) ఆర్థిక, ప్రణాళిక మొదటి స్థాయీ సంఘం సమావేశాల్లో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌తో పాటు పలువురు జడ్పీటీసీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిన్నారం జడ్పీటీసీ కుంచాల ప్రభాకర్, పటాన్‌చెరు జడ్పీటీసీ గడీల శ్రీకాంత్‌గౌడ్‌లు మాట్లాడుతూ రోడ్లు భవనాల శాఖ ద్వారా చేపట్టిన పనులు నత్తనడకన సాగుతున్నాయన్నారు. గతేడాది వేసవిలో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసిన వారికి బకాయి ఉన్న డబ్బులను వెంటనే విడుదల చేయాలని కోరారు. మిషన్ భగీరథ కింద ఇంట్రా పైపులైన్లు వేసి గ్రామాలకు నీటిని సరఫరా చేయాలని తెలిపారు. గ్రామాల్లో వాటర్ ట్యాంక్‌లు, సంప్‌లు శుభ్రం చేయకపోవడం వల్ల ప్రజలు రోగాల బారిన పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ.90 వేల కరంట్ బిల్లు రావడంతో గుండెపోటుతో చనిపోయిన దిడ్గి గ్రామానికి చెందిన రైతు కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జడ్పిటిసిలు మనోహర్‌గౌడ్, సత్తయ్య, సీఈవో రవి, గణాంక అధికారి సయ్యద్ ఖరీం సాహెబ్, పర్యవేక్షకులు ఎం.జమ్లా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సినిమాలు

సిద్దిపేట

బాలాజీ	లై
సీతారామాంజనేయ	ఫిదా
శ్రీనివాస	జయ జానకి నాయక
వెంకటేశ్వర	నేనే రాజు నేనే మంత్రి

దుబ్బాక

శ్రీనివాస	జయ జానకి నాయక

చేర్యాల

బాలాజీ	లై



కడవేరుగులో ఈత మొక్కల పెంపకానికి చర్యలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

చేర్యాల: 'ఈత మొక్కలు.. మేకల పాలు' శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి చేర్యాల ఎక్సైజ్‌శాఖ, ఉపాధిహామీ అధికారులు స్పందించారు. మండలంలోని కడవేరుగు గ్రామంలో కల్లు గీత కార్మిక సొసైటీ స్థలంలో ఈత మొక్కలు నాటేందుకు వారు చర్యలు తీసుకున్నారు. మూడో విడత హరితహారంలో భాగంగా సొసైటీకి చెందిన ఐదెకరాల్లో 2 వేలకు పైగా ఈత మొక్కల పెంచనున్నారు. మొక్కల పెంపకానికి గుంతలు తీయించే విషయమై ఎక్సైజ్‌శాఖాధికారులు ఉపాధిహామీ అధికారులతో, సొసైటీ సభ్యులతో మాట్లాడారు. ఏపీవో మంజుల సూచన మేరకు గుంతలు తీయించగా 1000 మొక్క లను నాటించారు. వర్షంతో పాటు వ్యవసాయ పనుల కారణంగా కూలీలు రానందున జాబ్‌కార్డులున్న సొసైటీ సభ్యులచే గుంతలు తీయిస్తున్నామని, రెండు రోజుల్లో మిగతా మొక్కలు నాటుతామని తెలిపారు.


సొసైటీ స్థలంలో ఈత మొక్కలను నాటుతున్న కూలీలు

చేర్యాలలో ఎడతెరిపి లేని వర్షం

చేర్యాల: అల్పపీడన ప్రభావంతో రుతుపవనాలు చురుకుగా కదిలి రెండు రోజులపాటు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖాధికారులు ప్రకటించిన నేపథ్యంలో చేర్యాల, కొమురవెల్లి మండలాల్లో శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎడతెరిపి లేని వర్షం కురిసింది. కొన్నాళ్లుగా వర్షం జాడలేక పంటలు దెబ్బతినే దశలో ఉన్న క్రమంలో ప్రస్తుతం కురుస్తున్న వర్షం జీవం పోసింది. దీంతో రైతులు ఊరట చెందారు. వర్షం కారణంగా జనగామ-సిద్దిపేట ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంతల్లో అక్కడక్కడా నీరు నిలవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ఆదివారం కూడా వర్షం పడే అవకాశం ఉండటంతో వ్యాధులు రాకుండా ప్రజలు జాగ్రత్తగా ఉండాలని వైద్యసిబ్బంది సూచిస్తున్నారు.


చేర్యాలలోని సినిమా హాల్ సమీపంలో నిలిచిన వర్షపు నీరు

పాపన్న జయంతిని అధికారికంగా నిర్వహించాలి

• కొమురవెల్లి మండల గౌడ సంక్షేమ సంఘం డిమాండ్

చేర్యాల: బహుజనుల అభ్యున్నతి కోసం పోరాడిన సర్దార్ సర్వాయి పాపన్న జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని కొమురవెల్లి మండల గౌడ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మేరుగు కృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం కొమురవెల్లిలో గౌడ సంఘం ఆధ్వర్యంలో సర్వాయిపాపన్న జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాపన్న పోరాట పటిమను గుర్తించి ప్రభుత్వం ట్యాంక్‌బండ్‌పై విగ్రహాన్ని ఏర్పాటు చేసి, అధికారికంగా జయంతిని నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు ముత్యం నర్సింహులు, పుల్లం బిక్షపతి, తాళ్లపల్లి రాజు, బుడిగె గురువయ్య, మేరుగు శ్రీనివాస్, పచ్చిమడ్ల స్వామి, కొయ్యడ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


పాపన్న చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గౌడ సంఘం నాయకులు

మొక్కలను నాటడమే కాదు.. సంరక్షించాలి

• రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే రామలింగారెడ్డి

మిరుదొడ్డి: మొక్కలను నాటడమే కాదు, వాటిని సంరక్షించే బాధ్యతను ప్రతి ఒక్కరూ తీసుకోవాలని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే సోలిపేట రామలింగారెడ్డి అన్నారు. శనివారం మిరుదొడ్డి మండలం ధర్మారం గ్రామ హరితహారంలో ఆయన మొక్కలను నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతిఒక్కరూ బాధ్యతగా మొక్కలను నాటాలన్నారు. అంతేకాకుండా వాటిని సంరక్షించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. మొక్కల సంరక్షణకు ట్రీగార్డులను అందిస్తామని ఆయన తెలిపారు. హరితహారాన్ని గ్రామాల్లో ఉద్యమంలా చేపట్టాలని ఆదేశించారు. ఆయన వెంట ఏఎంసీ చైర్మన్ బాపురెడ్డి, గ్రామ సర్పంచ్ లక్ష్మీమైసయ్య, నాయకులు శ్రీనివాస్, వెంకటస్వామి, మైసయ్య తదితరులున్నారు.


ధర్మారంలో మొక్కను నాటి, ట్రీగార్డును ఏర్పాటు చేస్తున్న రామలింగారెడ్డి

కాంగ్రెస్ ఓబీసీ సెల్ కమిటీ అధ్యక్షుల నియామకం

చేర్యాల: కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ చేర్యాల మండల, పట్టణ కమిటీ అధ్యక్షులను నియమిస్తూ ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ ఉత్తర్వులు జారీ చేశారు. టీపీసీసీ మాజీ చీఫ్ పొన్నాల లక్ష్మయ్య సూచన మేరక మండలంలోని చుంచనకోట గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ ఆది శ్రీనివాస్‌ను ఓబీసీ సెల్ మండలాధ్యక్షుడుగా, చేర్యాలకు చెందిన సీనియర్ నాయకుడు కూరపాటి మధుసూదన్‌ను పట్టణాధ్యక్షుడిగా నియమించారు. ఈ మేరకు శనివారం చేర్యాలలో వారు విలేకరులతో మాట్లాడుతూ టీఆర్ఎస్ ప్రభుత్వం అమలుచేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడుతూ పార్టీ పటిష్టతకు కృషి చేస్తామన్నారు. తమ నియామకానికి సహకరించిన టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ ముస్త్యాల కిష్టయ్య, డీసీసీ కార్యదర్శి వకుళాభరణం నర్సయ్యపంతులు, మండలాధ్యక్షుడు కొమ్ము రవి తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు. వీరి వెంట డీసీసీ ఉపాధ్యక్షుడు ధర్మపురి శ్రీనివాస్, చింతకింది మల్లేశం, ముస్త్యాల యాదగిరి, బుడిగె గురువయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.


నియామక పత్రాన్నిస్తున్న కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్

'హరితహారం'లో నిర్లక్ష్యం తగదు

• ఎంపీపీ కవితాశ్రీనివాస్‌గౌడ్

మిరుదొడ్డి: ప్రభుత్వం ప్రతిష్టత్మకంగా చేపట్టిన హరితహారం కార్యక్రమంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఎంపీపీ పంజాల కవితశ్రీనివాస్‌గౌడ్ హెచ్చరించారు. శనివారం మిరుదొడ్డిలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. అధికారులు హరితహారం ద్వారా మొక్కలను నాటాలని, నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలుంటాయన్నారు. మండలవాసులు నెలాఖరులోగా వ్యక్తిగత మరుగుదొడ్లను నిర్మించుకునేలా చూడాలని, నిర్మించుకున్న వారికి వెంటనే బిల్లు చెల్లించాలన్నారు. ఈ సమావేశంలో మండల ప్రత్యేకాధికారి మనోజ్‌కుమార్, తహసీల్దార్ అబ్దుల్ రహమాన్, ఎంపీడీవో మధుసూదన్, ఏఎంసీ చైర్మన్ బాపురెడ్డి, ఎంపీపీ ఉపాధ్యక్షుడు బాల్‌రాజు, వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కవిత

'హరిత' తెలంగాణ కోసం ప్రభుత్వం కృషి

• తొగుట మార్కెట్ కమిటీ చైర్మన్ కనకయ్య

తొగుట: ఆకుపచ్చ తెలంగాణ కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ కృషి చేస్తున్నారని తొగుట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కనకయ్య అన్నారు. శనివారం సాయంత్రం వర్షం కురుస్తున్నా స్థానిక కస్తూర్బా విద్యాలయ ఆవరణలో ఆయన అధికారులతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం కనకయ్య మాట్లాడుతూ హరితహారం కార్యక్రమంలో భాగంగా వర్షంలో సైతం మొక్కలు నాటుతున్నట్లు తెలిపారు. మొక్కల సంరక్షణ సైతం చేపట్టాలని అధికారులకు సూచించారు. ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలన్నారు. ఈ విషయమై అధికారులు ప్రజలను చైతన్యవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాజిరెడ్డి, ఏపీవో కిషన్‌రాజ్, టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మల్లారెడ్డి, లక్ష్మాపూర్ సర్పంచ్ పిట్ల శ్రీనివాస్, గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.


మొక్కను నాటుతున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

'మీ-సేవలో డబ్బు వసూలు చేస్తున్నారు'

దుబ్బాక: పట్టణంలోని మీ-సేవ కేంద్రాల్లో నిబంధనలకు విరుద్ధంగా ప్రజల నుంచి డబ్బులను అదనంగా వసూలు చేస్తున్నారని శనివారం స్థానిక తహసీల్దార్ అరుణకు రైతులు ఎల్లారెడ్డి జంగిరెడ్డి, నర్సింలు, చంద్రం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఏదైనా పని కోసం వెళితే అదనంగా డబ్బు తీసుకుంటున్నారని, ఆ కేంద్రాల యజమానులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతులతో కలిసి పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.


తహసీల్దార్‌కు వినతిపత్రాన్నిస్తున్న రైతులు

'బిడ్డకు తల్లిపాలే శ్రేయస్కరం'

దుబ్బాక: పుట్టినబిడ్డకు తల్లిపాలే శ్రేయస్కరమని దుబ్బాక నగరపంచాయతీ కమిషనర్ బోగేశ్వర్ అన్నారు. నగరపంచాయతీ పరిధిలోని చేర్వాపూర్ వార్డులో గల అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం తల్లిపాల వారోత్సవాల్లో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సత్యలక్ష్మి, ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు రుబెల్లా టీకాలు

చిన్నకోడూరు: మండలంలోని గుర్రాలగొంది హైస్కూల్‌లో శనివారం సర్పంచ్ అంజనేయులు, ఎంపీటీసీ మల్లేశం, హెచ్ఎం నర్సింహారెడ్డిలు విద్యార్థులకు రుబెల్లా టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం నిర్మల, అంగన్‌వాడీ టీచర్లు రేణుక, పాఠశాల ఉపాధ్యాయులు లక్ష్మయ్య, శ్రీనివాస్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

శనీశ్వరుడికి తైలాభిషేకం

చేర్యాల టౌన్: శనిత్రయోదశి వేడుకలను శనివారం చేర్యాలలోని చెన్నకేశవస్వామి ఆలయంలో ఘనంగా నిర్వహించారు. శనీశ్వరుడికి తైలాభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. అలాగే మండలంలోని పోతిరెడ్డిపల్లిలోని సాయిబాబా మందిర ఆవరణలోని శనీశ్వరాలయంలో విశేష పూజలను నిర్వహించారు.


ఒత్తి మాలతో శనీశ్వరుడికి అలంకరణ

సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా

చేర్యాల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజావ్యతిరేక విధానాలు అవలంబించడం తగదంటూ శనివారం చేర్యాల తహసీల్ కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఆ పార్టీ మండల కార్యదర్శి వెంకట్‌మావో, నాయకుడు ఒగ్గు రాజు మాట్లాడుతూ ఎన్నికల హామీల అమలులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. అనంతరం తహసీల్ కార్యాలయ ఉద్యోగికి వినతిపత్రాన్నిచ్చారు. ఈ ధర్నాలో నాయకులు వంకాయల కనకయ్య, ఎల్లయ్య, కమలాపురం జయరాంలు, బైర లింగం, దానయ్య, కనకయ్య, బాలు, మల్లయ్య, ఎల్లయ్య పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి సిద్దిపేట
సిద్దిపేట ● ఆదివారం 20 ఆగస్టు 2017

‘ఇన్‌పుట్’ చెల్లింపులో అవకతవకలు

- వ్యవసాయాధికారి సబ్సిడీ రాలేదన్నారు
- ఒకే రైతు పేరు మీద పలుమార్లు విడుదల
- పెద్దచీకోడు గ్రామ రైతుల ఆరోపణ


సమావేశంలో మాట్లాడుతున్న చీకోడు గ్రామ రైతులు

సిద్దిపేట క్రైం: జిల్లాలోని దుబ్బాక మండలం పెద్ద చీకోడు గ్రామ రైతులకు మంజూరయిన ఇన్‌పుట్ సబ్సిడీలో అవకతవకలు జరిగాయని గ్రామ రైతులు ఆరోపించారు. శనివారం సిద్దిపేటలోని స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రైతులు మాట్లాడారు. రైతులకు చెందాల్సిన ఇన్‌పుట్ సబ్సిడీ డబ్బు అందడం లేదన్నారు. ఎందుకని దుబ్బాక అగ్రికల్చర్ అధికారిని అడిగితే మీ పేర్ల మీద సబ్సిడీ రాలేదన్నారని తెలిపారు. ఒకే జాబితాలో ఒకే పేరు మీద మూడునాలుగు సార్లు సబ్సిడీ వచ్చినట్లు తెలిపారు. జాబితాలో అసలు భూమి లేనివారు చాలా మంది ఉన్నారని వాపోయారు. ఈ సమావేశంలో చికోడు రైతులు నర్సయ్య, హనుమంతురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూమి ఉన్న అసలైన రైతులకే సబ్సిడీ

- మల్లేశం, వ్యవసాయాధికారి, దుబ్బాక



దుబ్బాక మండలం పెద్దచీకోడు గ్రామానికి సంబంధించిన ఇన్‌పుట్ సబ్సిడీ అవకతవకల విషయంలో వివరణ కోరగా ఇన్‌పుట్ సబ్సిడీ భూమి ఉన్న అసలైన రైతుల ఖాతాలోనే జమ ఆవుతుందని స్పష్టం చేశారు. చీకోడు వీఆర్వో సర్వే ప్రకారం రాసి ఇచ్చిన జాబితా ప్రకారం ఈ సబ్సిడీని చెల్లించామన్నారు. ఒకే రైతు పేరు మీద రెండుమూడు సార్లు సబ్సిడీ వస్తే వాటిని ప్రభుత్వానికి తిరిగి పంపించామన్నారు. 2012 నుంచి 2017వ సంవత్సరం వరకు దుబ్బాక మండలానికి క్రాప్ ఇన్సూరెన్స్ విడుదల కాలేదన్నారు.

ఒంటికాలుపై నిలబడి ఐకేపీ సిబ్బంది నిరసన


ఒంటికాలుపై నిలబడి నిరసన తెలుపుతున్న ఐకేపీ సిబ్బంది

సిద్దిపేట రూరల్: ఇందిరా క్రాంతి పథం సిబ్బంది చేపట్టిన సమ్మె శనివారం నాల్గో రోజుకు చేరింది. సిబ్బంది ఒంటికాలుపై నిలబడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మండల అకౌంటెంట్ అండ్ కంప్యూటర్ అపరేటర్ల ఉద్యోగుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి భాస్కర్ మాట్లాడుతూ ఐకేపీలో పనిచేస్తున్న సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని, కంప్యూటర్ ఆపరేటర్లు, ఆకౌంటెంట్లు, అటెండర్, వాచ్‌మెన్లను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. అలాగే సెర్ప్ హెచ్‌ఆర్ పాలసీ వర్తింపజేసి రూ.18,500, అటెండర్లకు రూ.10,500 కనీస వేతనంగా ఇవ్వాలని కోరారు. మహిళా ఉద్యోగులకు ప్రసూతి సెలవులు మంజూరు చేయాలని, శ్రీనిధి ద్వారా వచ్చే లాభాల్లో తమకు కూడా వాటా వర్తించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షురాలు జ్యోతి, కోశాధికారి బాలనారాయణ, సభ్యులు శ్రీనివాస్ పాల్గొన్నారు.

నష్టపరిహారం పెంచాలని వినతి


అధికారికి వినతిపత్రాన్నిస్తున్న గౌడ కులస్థులు

చిన్నకోడూరు: రంగనాయక సాగర్ రిజర్వాయర్ ముంపుతో భూములు కోల్పోతున్న చంద్లాపూర్ గ్రామంలోని గౌడ కులస్థులు నష్టపరిహారం పెంచాలని కోరుతూ శనివారం చిన్నకోడూరు ఉప తహసీల్దార్ రాజిరెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకుడు, గౌడ సంఘ నాయకుడు సూరగోని రవిగౌడ్ మాట్లాడుతూ భూములు కోల్పోవడమే కాకుండా, తమ జీవనోపాధి పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి తమకు నష్టపరిహారం పెంచాలని వారు డిమాండ్ చేశారు.

ఉచిత వైద్యశిబిరం

చిన్నకోడూరు: మండలంలోని గుర్రాలగొంది గ్రామంలో శనివారం బాలవికాస ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. సర్పంచ్ ఆంజనేయులు మాట్లాడుతూ బాలవికాస సేవలు అభినందనీయమన్నారు. ఈ శిబిరంలో 231 మందికి వైద్యులు పరీక్షలు చేశారు. కార్యక్రమంలో లతా భవానీ ఆస్పత్రి వైద్యుడు రాజేశ్వర్, సాయి దంత వైద్యశాల వైద్యుడు ప్రవీణ, నిరమయా హాస్పిటల్ ఎండీ ప్రసుణరెడ్డి రోగులను పరీక్షించారు. ఈ శిబిరంలో ఎంపీటీసీ మల్లేశం, ఉపసర్పంచ్ శివయ్య, బాలవికాస ప్రతినిధులు రాజశేఖర్‌రెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.


వైద్యశిబిరంలో పాల్గొన్న సర్పంచ్ ఆంజనేయులు

హాస్టళ్లలో సమస్యలను పరిష్కరించాలి

- ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్
- కలెక్టరేట్ ఎదుట ఎస్‌ఎఫ్‌ఐ ధర్నా

సిద్దిపేట కల్చరల్: హాస్టళ్లలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శనివారం ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో సిద్దిపేట కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం డీఆర్వో చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు దాసరి ప్రశాంత్ మాట్లాడుతూ పెంచిన మెస్, కాస్మోటిక్ ఛార్జీలకు అనుగుణంగా హాస్టళ్లలో కొత్త మెనూను పాటించడంలేదని ఆరోపించారు. అంతేకాకుండా గెస్ట్ ఫ్యాకల్టీతో విద్యాబోధన చేస్తున్నారన్నారు. వారిని తొలగించి రెగ్యులర్ టీచర్లను నియమించాలని డిమాండ్ చేశారు. మూడు నెలలుగా విద్యార్థులకు అందాల్సిన మెస్, కాస్మోటిక్ ఛార్జీలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. విద్యార్థులుకు సీజనల్ వ్యాధులు రాకుండా వారానికో సారి వైద్యులచే పరీక్షలు చేయించాలని, దోమ తెరలను కూడా అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు స్వర్గం శ్రీకాంత్, భరత్, జక్కుల కార్తిక్, ఆకాశ్, శ్రీకర్, ప్రణయ్, ప్రశాంత్ పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న కేంద్రం

- సీపీఎం నాయకుడు రేవంత్‌కుమార్

సిద్దిపేట రూరల్: కేంద్ర ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానలకు పాల్పపడుతోందని సీపీఎం పార్టీ సిద్దిపేట జిల్లా కార్యవర్గ సభ్యుడు రేవంత్ కుమార్ విమర్శించారు. శనివారం సిద్దిపేట రూరల్ మండల కార్యాలయం ఎదుట నిరసన తెలిపి ఆర్ఐకి వినతిపత్రం అందజేశారు. రేవంత్‌కుమార్ మాట్లాడుతూ రైతులు సాగుకు చేసిన అప్పులు తీర్చలేక ఆత్మహత్య చేసుకుంటుంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం రైతుల అప్పులపై విచారణ జరిపి, రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు కనకయ్య, మల్లయ్య, మహేశ్, భాస్కర్ పాల్గొన్నారు.

గుర్రాలగొందిలో దేవరకొండ సర్పంచుల పర్యటన

చిన్నకోడూరు: మండలంలోని గుర్రాలగొంది గ్రామానికి శనివారం దేవరకొండ నియోజకవర్గంలో సర్పంచుల బృందం సందర్శించింది. గ్రామంలో బాలవికాస వాటర్‌ప్లాంట్, శ్మశానవాటిక, పెద్దరాముని చెరువు అభివృద్ధిని పరిశీలించారు. శ్మశానవాటిక పూలచెట్లతో ఆహ్లాదకరంగా ఉందన్నారు. మంత్రి హరీశ్‌రావు సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు సర్పంచ్ శాతరాజుపల్లి ఆంజనేయులు తెలిపారు.


శ్మశానవాటికను పరిశీలించిన సర్పంచులు

రుబెల్లా వ్యాక్సినేషన్

సిద్దిపేట రూరల్: సిద్దిపేట మండలం నాంచారుపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం ఎంఆర్ వ్యాక్సినేషన్ కార్యక్రమం జరిగింది విద్యార్థులకు, అంగన్‌వాడీ పిల్లలకు రుబెల్లా టీకాను వేశారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం వినోద, హెచ్ఎం పి.రవీందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు మాధవీలత, రవి, మల్లికార్జున్‌రెడ్డి, విమల, ఆశ వర్కర్ బి.మాధవి తదితరులు పాల్గొన్నారు.

క్రీడా జట్ల ఎంపిక

సిద్దిపేట టౌన్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సిద్దిపేట అర్బన్ మండల పరిధిలో వివిధ క్రీడాంశాల్లో పోటీలను నిర్వహిస్తున్నట్లు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండల ఇన్‌చార్జీ సత్యనారాయణ రెడ్డి తెలిపారు. కబడ్డీ, వాలీబాల్, ఖో-ఖో తదితర విభాగాల్లో అండర్ 14, 17 విభాగాల్లో ఈ నెల 23, 24 తేదీల్లో బాలబాలికలకు పోటీలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

డాక్ సేవకుల సమస్యలను పరిష్కరించాలి

- సంఘం జిల్లా కార్యదర్శి గుండుకాడి శంకర్


సమ్మెలో పాల్గొన్న గ్రామీణ డాక్ సేవకులు

సిద్దిపేట రూరల్: తపాలా శాఖలో పనిచేస్తున్న గ్రామీణ డాక్ సేవకుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆల్ ఇండియా గ్రామీణ డాక్ సేవక్ యూనియన్ సిద్దిపేట జిల్లా సంఘం కార్యదర్శి గుండుకాడి శంకర్ డిమాండ్ చేశారు. యూనియన్ ఆధ్వర్యంలో సిద్దిపేట తపాల శాఖ కార్యాలయం ఎదుట చేపట్టిన సమ్మెలో శంకర్ మాట్లాడారు. డాక్ సేవకులకు సివిల్ సర్వెంట్ హోదా కల్పించాలని, ఢిల్లీ క్యాట్ ప్రిన్సిపాల్ బెంచ్, మద్రాస్ క్యాట్ బెంచ్ తీర్పు ప్రకారం జీడీఎస్‌లకు పెన్షన్ మంజూరు చేయాలన్నారు. గతంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చనందునే మళ్లీ సమ్మె చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు జనార్ధన్‌రెడ్డి, కోశాధికారి ఎల్లయ్య, నాయకులు మంద ఆంజనేయులు, కె.రామచంద్రం, మనోహర్, చందర్‌రావు, నాంపల్లి తిరుపతిరెడ్డి, పాకాల శంకర్, నాగరాజు, మీణ, శ్రీలత, వెంకటేశ్ పాల్గొన్నారు.

బంగారు మైసమ్మ ఆలయ ట్రస్టు భవనం నిర్మాణానికి శంకుస్థాపన


భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

సిద్దిపేట కల్చరల్: పట్టణంలో బంగారు మైసమ్మ దేవాలయం ట్రస్టు భవనం నిర్మాణానికి ఆలయ కమిటీ సభ్యులు శనివారం శంకుస్థాపన చేశారు. సిద్దిపేటలోని పారిపల్లి వీధిలో వెలసిన మైసమ్మ ఆలయంలో నిత్యం భక్తులు పూజలు నిర్వహిస్తున్నారు. ఈ ఆలయాభివృద్ధికి దాతల సహకారంతో ట్రస్టు భవనాన్ని నిర్మిస్తున్నట్లు కమిటీ తెలిపింది. ఈ శంకుస్థాపన కార్యక్రమానికి కమిటీ గౌరవ అధ్యక్షుడు గంప శ్రీనివాస్, అధ్యక్షుడు యాద శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు పుల్లూరి శివకుమార్, ప్రధాన కార్యదర్శి వేదరాజు కన్నయ్య, కోశాధికారి గంప కృష్ణ, కార్యదర్శి మాంకాల నవీన్, పీఆర్వో పల్లె శంకర్ తదితరులు హాజరయ్యారు.

అధికారుల తీరుపై సభ్యుల ఆగ్రహం

- ప్రజా సమస్యలపై వాడీవేడి చర్చ
- వ్యవసాయ, విద్యుత్, పశువైద్య శాఖల అధికారుల నిలదీత
- ఏఈవోను తొలగించాలని డిమాండ్


పశువైద్యాధికారి భారతిని నిలదీస్తున్న సర్పంచ్

కోహెడ: అధికారుల తీరును మండల ప్రజాప్రతినిధులు ఏకరవు పెట్టారు. అన్ని శాఖల అధికారుల నిర్లక్ష్యాన్ని తూర్పారబట్టారు. వ్యవసాయ, విద్యుత్, పశువైద్య శాఖల అధికారులను నిలదీశారు. శనివారం కోహెడ మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ ఉప్పులస్వామి అధ్యక్షతన జరిగింది. ఏఈవో కాటం రాజు రైతు సమస్యలను పట్టించుకోవడం లేదని, ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని సభ్యులు మండిపడ్డారు. ఆయన్ను ప్రభుత్వానికి సరెండర్ చేయాలని డిమాండ్ చేశారు. చెంచల్‌చెర్వుపల్లిలో సబ్సిడీ విత్తనాల పంపిణీ సక్రమంగా జరగలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై విచారణ జరపాలని జేడీఏకు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదని ఆరోపించారు. ఏడీఏ వచ్చే వరకు సభ నిర్వహించరాదని సభ్యులు పట్టుబట్టారు. కూరెల్ల గ్రామాన్ని విత్తనోత్పత్తి కేంద్రంగా ఏ విధంగా ఎంపిక చేశారని ప్రశ్నించారు. అవకతవకలకు పాల్పడిన ఏఈవోను తొలగించాలని డిమాండ్ చేశారు. సబ్సిడీ గొర్రెలు అమ్మకోకుండా చూడాలని పశువైద్యాధికారి భారతికి సూచించారు. గొర్రెలకు వైద్యం అందడం లేదని, రెండు నెలలుగా విధులకు ఎందుకు హాజరు కావడం లేదని శనిగారం సర్పంచ్ శ్రీధర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఆమె కంటతడి పెట్టారు. ప్రైవేటు పాఠశాలలో విద్యార్థుల సంఖ్యపెరుగుతోందని, సర్కారు స్కూళ్లలో విద్యార్థుల సంఖ్య ఎందుకు తగ్గుతోందని ఎంఈవోపై ఎంపీపీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే సతీష్‌కుమార్ మన ఊరు- మన ఎమ్మెల్యే పర్యటన అధికారికంగా, అనధికారికమా అనే విషాయాన్ని చెప్పాలని వింజపల్లి ఎంపీటీసీ మాధవి అధికారులను కోరారు. అధికారికంగా అయితే సంబంధిత ఎంపీటీసీని కూడా వేదికపైకి పిలవాలని సభ దృష్టికి తెచ్చారు. ఉపాధి హామీ పథ కం సిబ్బంది కారణంగా ఇంకుడు గుంతల బిల్లులు రావడం లేదని సభ్యులు ఆరోపించారు. సమావేశంలో జడ్పీటీసీ లక్ష్మణ్, ఎంపీడీవో శ్రీనివాస్, తహసీల్దార్ నరేందర్, ఈవోపీఆర్డీ మల్లికార్జున్, ఏడీఏ మహేష్, ఎంఈవో సత్యనారాయణరెడ్డి, ఎక్సైజ్ ఎస్ఐ బేగ్, ఏపీఎం తిరుపతి, ఏపీవో శిరీష, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్వరూపారాణి, సర్పంచులు శ్రీధర్, కనకయ్య, బాల్‌రాజ్, శ్రీనివాస్‌గౌడ్, మల్లారెడ్డి, ఎంపీటీసీలు రవీందర్, బాల్‌రాజ్, నాగరాజు, మాధవి, వసంత పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ఐక్యంగా పోరాడాలి


సమావేశంలో మాట్లాడుతున్న గోపాల్‌రెడ్డి

మద్దూరు: పేద రెడ్డి కులస్తులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఐక్యంగా పోరాటాలు చేసి హక్కులను సాధించుకోవాలని రెడ్డి ఐక్య వేదిక రాష్ట్ర ముఖ్య సలహాదారులు గోపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం మద్దూరులో మండల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద రెడ్డిలు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం మండల కమిటీలను ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా అనిల్‌రెడ్డి, కార్యదర్శులుగా మహిపాల్‌రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, ముఖ్య సలహాదారుగా బుచ్చిరెడ్డి, యూత్ విభాగం మండల అధ్యక్ష, కార్యదర్శులుగా భాస్కర్‌రెడ్డి, మల్లారెడ్డి, జిల్లా సలహాదారుగా నర్సింహారెడ్డి, మహిళా విభాగం మండల అధ్యక్షురాలిగా లక్ష్మిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్య సలహాదారులు గోపాల్‌రెడ్డి, జిల్లా యూత్ అధ్యక్ష కార్యదర్శులు విజయ్‌భాస్కర్‌రెడ్డి, రాజీవ్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై నిలదీస్తే కేసులు పెడతారా?

మద్దూరు: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపితే నాయకులపై కేసులు పెట్టడం సరికాదని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దాసరి కళావతి సూచించారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. అధికారులు సమస్యలను పట్టించుకోకపోవడంతో మండల సర్వసభ్య సమావేశాన్ని అడ్డుకున్నట్లు తెలిపారు. ఎంపీడీవోకు వినతిపత్రం ఇచ్చే సమయంలో ఎంపీపీ భర్తతో పాటు టీఆర్ఎస్ నాయకులు దుర్భాషలాడి దాడికి యత్నించడం శోచనీయమన్నారు. వెంటనే అక్రమ కేసులు వెనక్కు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో పార్టీ నాయకులు సావిత్రి, షఫీ, అనూక్, మహేందర్, రవి తదితరులు పాల్గొన్నారు.

కోరం లేక మండల సర్వసభ్య సమావేశం వాయిదా

బెజ్జంకి: మండల సర్వసభ్య సమావేశానికి ప్రజా ప్రతినిధులు హాజరుకాకపోవడంతో కోరం లేక సమావేశాన్ని ఎంపీపీ దామోదర్ వాయిదా వేశారు. ఈ సమావేశానికి కాంగ్రెస్ పార్టీకి చెందిన సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్, బేగంపేట ఎంపీటీసీ జయరాం మాత్రమే హాజరయ్యారు. అధికారులు వచ్చి ప్రజాప్రతినిధులు రాకపోవడంపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేశారు. అయితే వర్షం వల్లే ప్రజాప్రతినిధులు సమావేశానికి రాలేదని తెలిసింది.

నామమాత్రంగా హాజరైన ప్రజాప్రతినిధులు →



ఈ - పాస్ విధానంతో అక్రమాలకు చెక్: వైస్ ఎంపీపీ

మద్దూరు: ఈ-పాస్ విధానంతో రేషన్ దుకాణాల్లో అక్రమాలకు చోటు ఉండదని వైస్ ఎంపీపీ లక్ష్మి నర్సింహారెడ్డి తెలిపారు. శనివారం రేబర్తి గ్రామంలోని రేషన్ దుకాణాల్లో ఈ - పాసు విధానాన్ని అమల్లోకి తెచ్చారు. అనంతరం వైస్ ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు మాత్రమే అందాలనే ఉద్దేశంతో ఈ పాస్ విధానం అమలు చేస్తున్నట్లు వివరించారు. సీఎం కేసీఆర్ అన్ని వర్గాల సంక్షేమం కోసం పాటుపడుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ అందె భూపతి, మాజీ ఎంపీపీలు మఠం భద్రయ్య, బెల్లపు యాదయ్య, నాయకులు చారీ, చంద్రమౌళి, భూపతిరెడ్డి, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

పీఆర్టీయూ మండల కార్యవర్గం ఎన్నిక


నాళ్ల లక్ష్మయ్య, కీర్తి శ్రీధర్

మద్దూరు: పీఆర్టీయూ మండల కార్యవర్గాన్ని శనివారం ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్ష డిగా నాళ్ల లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శిగా కీర్తి శ్రీధర్, అసోసి యేట్ అధ్యక్షుడిగా కరుణాకర్, మహిళా విభాగం ఉపాధ్యక్షురాలిగా నిర్మల, కార్యదర్శిగా షఫీ, మహిళా కార్యదర్శిగా రాజేశ్వరీ, రేబర్తి స్కూల్ కాంప్లెక్స్ కన్వీనర్‌గా శివప్రసాద్, మద్దూరు స్కూల్ కాంప్లెక్స్ కన్వీనర్‌గా చంద్రశేఖర్, ధూల్మిట్ట స్కూల్ కాంప్లెక్స్ కన్వీనర్‌గా శ్రీనివాస్, ప్రచార కార్యదర్శిగా నరేష్, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా కుమార్, నాగేశ్వర్, సత్తయ్య, నరేందర్, జిల్లా మహిళా ఆర్గనైజింగ్ కార్యదర్శిగా రమాదేవి ఎన్నికయ్యారు. నాలుగు సార్లు ఎన్నికైన మండల అధ్యక్షుడు లక్ష్మయ్యను పలువురు అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీపీఎస్ ఉద్యోగులకు పాతపెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో పీఆర్టీయూ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో ఖాళీల భర్తీకి ప్రవేశాలు

కోహెడ: మండలంలోని సముద్రాల గ్రామ ఆదర్శ పాఠశాల, కళాశాలలో ఆరు నుంచి ఇంటర్ వరకు ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ నరేందర్‌రెడ్డి తెలిపారు. 6వ తరగతి 5, 7వ తనగతిలో 7, 8వ తరగతిలో 8, 9వ తరగతిలో 10, పదో తరగతిలో 20ఖాళీలు ఉన్నాయని తెలిపారు. ఇంటర్‌లో అన్ని గ్రూపుల్లో ప్రథమ, ద్వితీయ గ్రూపుల్లో ఖాళీలు ఉన్నాయన్నారు. అర్హత, ఆసక్తిగల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ నరేందర్ రెడ్డి సూచించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత


చెక్కు అందజేస్తున్న మంత్రి హరీశ్‌రావు

బెజ్జంకి: మండలంలోని శీలాపూర్ గ్రామానికి చెందిన ఎండీ పర్వాన్ అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స చేయించుకుంది. పేద కుటుంబానికి చెందిన పర్వాన్‌కు సీఎంఆర్ఎఫ్ కింద రూ. 30 వేలు మంజూరయ్యాయి. ఇందుకు సంబంధించిన చెక్కును శనివారం హైదరాబాద్‌లో మంత్రి హరీశ్‌రావు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఫుడ్ కమిషన్ మెంబర్ ఆనంద్, టీఆర్ఎస్ నాయకుడు రాజు పాల్గొన్నారు.

కాలువ నిర్మాణానికి భూముల పరిశీలన


భూముల మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఆర్డీవో శంకర్‌కుమార్

బెజ్జంకి: అనంతగిరి ప్రాజెక్టులో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో వరదకాలువ నిర్మాణం కోసం భూములను శనివారం ఆర్డీవో శంకర్‌కుమార్ పరిశీలించారు. కల్లెపల్లి, వడ్లూరు, గుండారం గ్రామాల్లోని ఆర్డీవో పర్యటించి భూములు కోల్పోతున్న రైతులతో సమాశాలు నిర్వహించారు. ఎకరానికి రూ. 12లక్షల పరిహారం అందించాలని రైతులు కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్‌రావు, ఆయా గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

బెజ్జంకి క్రాసింగ్‌లో ఉచిత వైద్య శిబిరం



మందులు పంపిణీ చేస్తున్న బాలవికాస ప్రతినిధులు

బెజ్జంకి: మండలంలోని ముత్తన్నపేట అనుబంధ గ్రామమైన బెజ్జంకి క్రాసింగ్‌లో శనివారం బాలవికాస స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 98 మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ వెంకటలక్ష్మి, వార్డు సభ్యులు విజయ, సుధాకర్‌రెడ్డి, తిరుపతి, శంకర్, బాలవికాస డీఏలు ఆగయ్య, జితేందర్ పాల్గొన్నారు.

పిల్లలకు రుబెల్లా టీకా వేయించాలి


విద్యార్థికి టీకా వేస్తున్న వైద్య సిబ్బంది

హుస్నాబాద్ రూరల్: ప్రాణాంతక వ్యాధులైన తట్టు, రుబెల్లా నివారణ కోసం తొమ్మిది నెలల నుంచి 15 సంవత్సరాల వయసున్న పిల్లలకు టీకా వేయించాలని వైస్ ఎంపీపీ రాంగోపాల్‌రావు సూచించారు. శనివారం మండలంలోని గాంధీనగర్ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు వైద్య సిబ్బంది టీకాలు వేశారు. కార్యక్రమంలో సర్పంచ్ వసంత, పాఠశాల హెచ్ఎం, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

గజ్వేల్‌లో సినిమాలు

సంతోష్	పిదా
యాదగిరి	నేనే రాజు నేనే మంత్రి
తూప్రాన్	
వెంకటేశ్వర	జయ జానకి నాయక

దుద్దెడలో రుబెల్లా వ్యాక్సినేషన్



టీకా వేయించుకోవడానికి క్యూలో ఉన్న విద్యార్థులు

కొండపాక: మండలంలోని పలు గ్రామాల్లో మిజిల్స్ రుబెల్లా వ్యాక్సినేషన్ 3వ రోజు శనివారం జరిగింది. దుద్దెడ సాయికృప ఉన్నత పాఠశాలలో సర్పంచ్ పెద్దంకల శ్రీనివాస్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. పిల్లలకు టీకాలు వేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వనజ, ఎంఎన్ఎం హమీదా, ఆశవర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతు బాంధవుడు సీఎం కేసీఆర్

టీఆర్ఎస్వీ ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్

గజ్వేల్ అర్బన్: సీఎం కేసీఆర్ రైతు బాంధవుడని టీఆర్ఎస్వీ ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షులు మాదాసు శ్రీనివాస్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ప్రతిష్ఠాత్మక అగ్రికల్చర్ లీడర్‌షిప్ అవార్డు దక్కడం ఆనందంగా ఉందన్నారు. సమావేశంలో టీఆర్ఎస్వీ జిల్లా నాయకులు ఇస్మాయిల్, రమేశ్‌గౌడ్, అహ్మద్, ఉమేర్ పాల్గొన్నారు.

23, 24 తేదీల్లో క్రీడాకారుల ఎంపిక

వర్గల్: మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 23, 24 తేదీల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలకు క్రీడాకారులను ఎంపిక చేయనున్నట్లు ఎంఈవో రాములు, పీడీ భాస్కర్‌రెడ్డి తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ వర్గల్ జవహర్ నవోదయ క్రీడా మైదానంలో 23, 24 తేదీల్లో అండర్ -14 -17 బాలురు, బాలికల విభాలకు విద్యార్థులను ఎంపిక చేస్తామన్నారు.

22నుంచి స్కూల్ గేమ్స్

కొండపాక: ఈ నెల 22 నుంచి మండల స్థాయి స్కూల్ గేమ్స్ జరుగుతాయని ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. అండర్ -14 బాలబాలికల విభాగం వాలీబాల్, కబడ్డీ, ఖోఖో పోటీలకు, అండర్ -17 విభాగంలో వేద ఇంటర్నేషనల్ స్కూల్ ఆవరణలో జరుగుతాయని తెలిపారు.

నేడు కొండపాకలో శత రుద్రాభిషేకం

కొండపాక: కొండపాకలోని రుద్రేశ్వరాలయంలో ఆదివారం శత రుద్రాబిషేకం జరుగుతుందని రుద్రేశ్వరాలయ ట్రస్టు ఉపాధ్యాక్షుడు పి. వీరేశం తెలిపారు. ఈ సందర్భంగా దేవాలయంలో ప్రత్యేక పూజలు జరుగుతాయని తెలిపారు.

నేడు దుద్దెడలో చండీ హోమం

కొండపాక: మండలంలోని దుదెడ్డ స్వయంభూ శంభు దేవాలయంలో ఆదివారం చండీ హోమం నిర్వహించనున్నట్లు ఆలయ సేవా సంస్థ ప్రధాన కార్యదర్శి మంచాల శ్రీనివాస్ తెలిపారు. శనివారం ఆయన మాట్లా డుతూ ఈ వేడుకలు ఆలయ సేవా సంస్థ చైర్మన్ రామచంద్ర మూర్తి ఆధ్వర్యంలో జరు గుతాయన్నారు. సికింద్రాబాద్‌కు చెందిన దాతలు గౌరిశెట్టి వినోద్, చంద్రకళ సౌజన్యంలో ఉదయం 10గంటల నుంచి ఒంటి గంట వరకు హోమం జరుగుతుందన్నారు.

భూముల రీ సర్వేకు రెండో రోజు తప్పని వర్షం

జగదేవ్‌పూర్: మండలంలోని దౌలాపూర్‌లో జరుగుతున్న భూముల రీ సర్వేకు రెండో రోజు కూడా వర్షం ఆటంకం కలిగించింది. శుక్రవారం వర్షం కారణంగా సర్వేను నిలిపివేయగా శనివారం కూడా ఇదే పరిస్థితి కొనసాగింది. ఉదయం నుంచి వర్షం కురుస్తుండడంతో పనులు జరగలేదు.

లబ్ధిదారులకు గొర్రెల పంపిణీ

చేగుంట: మండలంలోని పలు గ్రామాల్లో గొల్లకుర్మలకు సబ్సిడీ గొర్రెలను పంపిణీ చేశారు. కర్నూల్ జిల్లా నుంచి తీసుకువచ్చిన గొర్రెలను పశువైద్యాధికారి శ్రీనివాస్ లబ్ధిదారులకు అందజేసి వాటి ఆరోగ్య పరిస్థితిని పరిశీలించారు. చందాయిపేట, గొల్లపల్లి, చెట్లతిమ్మాయిపల్లి, బోనాల గ్రామాలకు చెందిన 141 లబ్ధిదారులకు 21 గొర్రెల చొప్పున అందజేశారు. చందాయిపేటకు చెందిన కొమురయ్యకు చెందిన గొర్రెలు రెండు ఈనగా సంతోషం వ్యక్తం చేశాడు. లబ్ధిదారులు గొర్రెల పెంపకంతో ఆర్థిక పురోగతి సాధించాలని పశువైద్యాధికారి శ్రీనివాస్ సూచించారు.

ఆడపిల్లలను కాపాడుకోవడం సామాజిక బాధ్యత

దౌల్తాబాద్ సర్పంచ్ ఆదివేణుగోపాల్





సర్పంచ్, ఎంపీటీసీలకు రాఖీలు కడుతున్న చిన్నారులు, పిల్లల ప్రగతి నివేదికలు అందజేస్తున్న సర్పంచ్

గజ్వేల్ అర్బన్/రాయపోల్: ఆడపిల్లలను కాపాడుకోవడం సామాజిక బాధ్యత అని దౌల్తాబాద్ సర్పంచ్ ఆదివేణుగోపాల్ అన్నారు. శనివారం మండల కేంద్రమైన దౌల్తాబాద్ అంగన్‌వాడీ కేంద్రంలో బేటీ బచావో, బేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్, ఎంపీటీసీ ఉమాదేవికి చిన్నారులు రాఖీ కట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆడపిల్లలపై వివక్ష చూపడత తగదన్నారు. బాలురతో సమానంగా చదువులో ప్రోత్సహించాలని సూచించారు. బాలికల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు గిరిజ, రమాదేవీ, ప్రతిభ తదితరులు పాల్గొన్నారు.

కుకునూర్‌పల్లిలో..

కొండపాక: పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపిచాలని కుకునూర్‌పల్లి సర్పంచ్ అయిలం యాదవ్ తల్లిదండ్రులకు సూచించారు. శనివారం అంగన్‌వాడీ కేంద్రంలో పూర్వ ప్రాథమిక విద్య, బేటీ బచావో బేటీ పడావో, రక్షబంధన్ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఆరోగ్యకర పిల్లల కోసం ప్రభుత్వం సరఫరా చేస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం పిల్లల ప్రగతి పత్రాలను తల్లులకు అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు శ్రీదేవి, భాగ్య, భాగ్యలక్ష్మి, కల్పన, సీడీపీవో పద్మ, ఏఎన్ఎం సుజాత, ఎంపీటీసీ సభ్యురాలు లక్ష్మి, పిల్లల తల్లులు పాల్గొన్నారు.

ఘనంగా బోనాల ఊరేగింపు

- **గ్రామ దేవతలకు పూజలు**
- **నేడు దుర్గమ్మ జాతర**



బోనాలతో ఊరేగింపు నిర్వహిస్తున్న ప్రజలు

జగదేవ్‌పూర్: మండలంలోని తీగుల్‌నర్సాపూర్‌లో బొడ్రాయి ప్రతిష్ఠ మహోత్సవం కొనసాగుతోంది. వేడుకల్లో భాగంగా మూడో రోజు శనివారం భక్తిశ్రద్ధలతో బోనాలు తీశారు. గ్రామ దేవతలకు పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు. శివసత్తుల శిగాలతో ఊరేగింపు సాగింది. పోతరాజుల విన్యాసాలు, బైండ్లవారి నృత్యాలు ఆకట్టుకున్నాయి. దీంతో గ్రామంలో జాతర సందడి నెలకొంది. ఆదివారం దుర్గమ్మ జాతర నిర్వహించనున్నట్లు స్థానికులు తెలిపారు. ఉత్సవాల్లో సర్పంచ్ రజిత రమేశ్, ఎంపీటీసీ శకుంతల యదగిరి, ఉత్సవ కమిటీ సభ్యులు లక్ష్మీనర్సింహారెడ్డి, సీహెచ్ కనకారెడ్డి, దేశాయిరెడ్డి, పెద్ద ఎల్లయ్య, కనకయ్య, భూపాల్‌గౌడ్, మహిపాల్, స్వామి, మన్నె శీను, కరీం, మహేశ్, చంద్రారెడ్డి, హరిబాబు, కిషన్‌చారి తదితరులు పాల్గొన్నారు.

తపాలా సిబ్బంది సమ్మెతో ఆగిన ఆసరా పెన్షన్లు

మర్కుక్: తపాలా డాక్ సేవక్ సిబ్బంది నిరవధిక సమ్మె ప్రభావం గ్రామాల్లోని ఆసరా పెన్షన్‌దారులు, ఉపాధి హామీ కూలీలపై పడింది. మూడు రోజులుగా తపాలా సిబ్బంది సమ్మె చేస్తుండడంతో గ్రామీణ ప్రాంత బ్రాంచ్ పోస్టాఫీసులు మూత పడ్డాయి. నియోజకవర్గంలోని పది పోస్టాఫీసుల పరిధిలోని 88బ్రాంచ్ పోస్టాఫీసు సేవలు నిలిచిపోయాయి. దీంతో వేలాది మందికి పింఛన్లు, ఉపాధి హామీ పథకం కూలీల చెల్లింపులు నిలిచిపోయాయి. వృద్ధులు, ఒంటరి మహిళలు పెన్షన్లు అందక తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారు. మర్కుక్ మండలం పాముల పర్తి సబ్‌పోస్టాఫీసులో 12బ్రాంచ్ పోస్టాఫీసులు ఉండగా గౌరారం, వర్గల్, ములుగు, క్షీరసాగర్ కేంద్రాల్లో పెన్షన్లు, ఉపాధి కూలీలకు చెల్లింపులు జరిగేవి. సమ్మె ప్రభావం 3,646మంది పెన్షన్‌దారులకు, 6వేలకు పైగా ఉపాధి కూలీలపై పడింది. సమ్మె ముగిస్తే తప్ప వీరికి డబ్బు అందే పరిస్థితి కనిపించడం లేదు.

నేత్రపర్వంగా సీతారాముల కల్యాణం



ఉత్సవ విగ్రహాలకు పూజలు చేస్తున్న భక్తులు



స్వామి వారి సేవలో మహిళలు

వర్గల్/మర్కుక్: మర్కుక్ మండలం పాములపర్తి సీతారామంజనేయ స్వామి ఆలయంలో పునర్వసు నక్షత్రం సందర్భంగా శనివారం జరిగిన సీతారామ కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ వేద పండితులు రాజశేఖరశర్మ, కార్తీక్ శర్మ నేతృత్వంలో కల్యాణ మహోత్సవం సాగింది. పూజల అనంతరం మహిళలు అమ్మవారికి ఒడిబియ్యం పోసి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. వేడుకల్లో స్వామి వారి కల్యాణ నిర్వాహకులు స్వామిగౌడ్, ఆలయ నిర్వాహకులు హన్మంతరావు, అశోక్ తదితరులు పాల్గొన్నారు. కల్యాణ వేడుకలో దంపతులు పూజలు చేశారు.

ప్రతి విద్యార్థీ లక్ష్యంతో ముందుకెళ్లాలి

ప్రిన్సిపాల్ ఐలయ్య

గజ్వేల్ అర్బన్/రాయపోల్: ప్రతి విద్యార్థీ లక్ష్యంతో ముందుకెళ్లాలని దౌల్తాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఐలయ్య సూచించారు. శనివారం కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుకు పేదరికం అడ్డుకాదని, తల్లిదండ్రులు కన్న కలలను నిజం చేసేందుకు కష్టపడి చదవాలని సూచించారు. ఇంటర్‌లో చెడు మార్గం పట్టే అవకాశం ఎక్కువగా ఉంటుందని, మంచి మార్గాన్ని ఎంచుకోవాలని సూచించారు. తోటి విద్యార్థులతో సోదర భావం తో మెలగాలన్నారు. బాగా చదువుకొని కళాశాలకు, ఊరికి పేరు తేవాలన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి. కార్యక్రమంలో మిరుదొడ్డి కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, బాలుర పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రుక్మిణి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్లు మంగ్యానాయక్, సంపత్‌కుమార్, లెక్చరర్లు దయానంద్, శివకుమార్, రాజు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి నవోదయ క్లస్టర్ లెవల్ బాల్ గేమ్స్

వర్గల్: మండల కేంద్రంలోని జవహర్ నవోదయ విద్యాలయంలో సోమవారం నుంచి మంగళవారం క్లస్టర్ లెవల్ బాల్ గేమ్స్ నిర్వహించనున్నట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ వెంకటరమణ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఈ పోటీల్లో ఉమ్మడి జిల్లాలైన ఆదిలాబాద్, మెదక్, వరంగల్, కరీంనగర్, మహబూబ్‌నగర్, ఖమ్మం, రంగారెడ్డి, నల్గొండ, నిజామాబాద్ జిల్లాల నవోదయ విద్యాలయాలకు చెందిన 300మంది విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. హ్యాండ్‌బాల్, బాస్కెట్ బాల్, ఫుట్‌బాల్, వాలీబాల్, బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇక్కడ ప్రతిభ చాటిన విద్యార్థులు ఇతర రాష్ట్రాల్లో జరిగే పోటీల్లో పాల్గొంటారని వివరించారు. హ్యాండ్‌బాల్ పోటీలు విజయనగరం(ఏపీ)లో జరుగుతాయన్నారు, బ్యాడ్మింటన్ ప్రకాశం- 1(ఏపీ)లో, బాస్కెట్‌బాల్ అనంతపురం (ఏపీ)లో, వాలీబాల్ రాయచూర్(కర్ణాటక), ఫుట్‌బాల్ మల్లాప్పురం(కేరళ)లో జరిగే రీజనల్ లెవల్ క్రీడల్లో పాల్గొంటారని తెలిపారు. అలాగే వర్గల్ నవోదయ విద్యార్థులు అథ్లెటిక్స్ పోటీలకు ఆదిలాబాద్‌కు, గ్రౌండ్ గేమ్స్ కోసం కరీంనగర్ నవోదయకు వెళ్లనున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. వీటితో పాటు మరికొందరు విద్యార్థులు ఆదిలాబాద్ నవోదయలో జరగబోయే క్లస్టర్ లెవల్ ఎగ్జిబిషన్‌లో గణితం, సోషల్‌సైన్స్, మ్యాథ్స్ ఎగ్జిబిట్స్‌ను ప్రదర్శించనున్నట్లు ఆయన వివరించారు.

ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ సత్యనారాయణకు అవార్డు ప్రదానం


ఎంపీ కవిత నుంచి అవార్డు అందుకుంటున్న సత్యనారాయణ

రాష్ట్రస్థాయి ఫొటోగ్రఫీ పోటీల్లో సంగారెడ్డి జిల్లా ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ ఎం.సత్యనారాయణ ఉత్తమ ఫొటోగ్రాఫర్‌గా ఎంపికైన విషయం తెలిసిందే. ఈ మేరకు హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో శనివారం ఆయన ఎంపీ కవిత చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా తెలంగాణ ఫొటో జర్నలిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం, పర్యాటక, భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో నిర్వహించిన పోటీల్లో ఆయన ఫొటో బహుమతికి ఎంపికైంది.

వర్షం.. సంబురం


అక్కన్నపేట మండలం చౌటపల్లిలో నీట మునిగిన వరి పైరు

సిద్దిపేట రూరల్/అక్కన్నపేట/హుస్నాబాద్ : సిద్దిపేట జిల్లాలో శనివారం పలుచోట్ల కురిసిన వర్షం చాలామంది రైతులకు ఉరటనిచ్చింది. కొన్నిచోట్ల మాత్రం పంటలు నీటమునిగాయి. సిద్దిపేట మండలంలో శుక్రవారం ఉదయం నుంచి శనివారం ఉదయం వరకు 6.02మీ.మీ వర్షం కురిసింది. అక్కన్నపేట మండలంలో కురిసిన భారీ వర్షానికి మండలంలోని పలు గ్రామాల్లో వరి, పత్తి పంటలు నీట మునిగాయి. పలు కుంటలు, చెరువుల్లోకి వరద నీరు వచ్చి చేరింది. హుస్నాబాద్ మండలంలో ఉదయం నుంచి రాత్రి వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. హుస్నాబాద్‌లోని రోడ్లన్నీ జలమయమయ్యాయి. పట్టణంలోని హన్మకొండ ప్రధాన రహదారి చెరువును తలపించింది. వాహన రాకపోకలు నిలిచిపోయాయి.


జలమయమైన హుస్నాబాద్ పట్టణంలోని హన్మకొండ ప్రధాన రహదారి


వర్షంలో రోడ్డుపై వెళ్తున్న మహిళలు


సిద్దిపేట రైతు బజారులో గొడుగుల సాయంతో వచ్చిన వినియోగదారులు







1. అంతర్జాతీయ తెలుగు మహాసభలో ప్రదర్శన ఇస్తున్న దేవదాసు కళాబృందం (ఫైల్)

2. మంత్రి హరీశ్‌రావుతో దేవదాసు కళాబృందం (ఫైల్)

3. దేవదాసును ప్రశంసిస్తున్న సినారే (ఫైల్)

జాంబవంతుడి వారసత్వం..

యక్షగానానికి ప్రాణం

యక్షగానం అంటే ఆయనకు ప్రాణం. తండ్రి కళను బతికించాలనేది ఆయన కల. అది నేరవేర్చుకున్నాడు. హార్మోనియం మోగిస్తూ.. తబలా వాయిస్తూ.. తాళాలు కొట్టడం ఆయనకు మహా ఇష్టం. వారసత్వంగా వచ్చిన కళలో చిన్నప్పుడే అరంగేట్రం చేసి అందరి అభిమానాలు చూరగొన్నాడు. బాల్యంలో ప్రహ్లాదుడిగా, శిరియాలుడిగా, లవకుశలుగా అదరగొట్టేవాడు. తర్వాత రావణుడు, మైరావణుడు, అభిమన్యుడు, నారదుడి వంటి వైవిధ్యమైన పాత్రల్లో జీవించాడు. ఆయన నాటకాలు చూసిన వారి గుండెల్లో పదిలమైన స్థానం సంపాదించుకున్నాడు. యక్షగాన కళకు జీవం పోస్తున్న ఆ కళాకారుడే పిల్లుట్ల దేవదాసు. తెలంగాణ సంప్రదాయ కళల్లో ఒకటైన యక్షగానానికి నేటికీ జీవం పోస్తూనే ఉన్నాడు. చిందుకళాకారుల్లో తనకుంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్నాడు. ప్రస్తుతం ప్రభుత్వ సంక్షేమ పథకాలను తన కళతో ప్రచారం చేస్తున్నాడు. ఈ కళ గురించి ఎన్నో ఆసక్తికరమైన విషయాలు దేవాదాసు మాటల్లోనే..

- సిద్దిపేట రూరల్




- పిల్లుట్ల దేవదాసు, యక్షగాన కళాకారుడు

మా జాతిని చిందుకళాకారులుగా పిలుస్తారు. అప్పట్లో ముఖానికి రంగులు వేసుకుంటూ, వేషాలు వేస్తూ రంగస్థలంపై విభిన్న పాత్రలకు జీవం పోసేవాళ్లం. ప్రేక్షకుల మనసులు దోచుకుంటూ చిందు కళను ప్రదర్శించాం. రాత్రి పూట వీధుల్లో కళా ప్రదర్శనలు ఇవ్వడం మా వంశస్తుల ఆనవాయితీ. ఇంకా అలానే కొనసాగుతూనే ఉంది. గ్రామ ప్రజలు ఇచ్చే సంభావన (ఆర్థిక సాయం, ధాన్యం)తో బతుకు వెళ్లదీసుకునేవాళ్లం. శశిరేఖా పరిణయం, వల్లీరాణి, సత్యాహరిశ్చంద్ర, సతీ అనసూయలాంటి సాంఘిక పౌరాణిక నాటకాలను యక్షగానం ద్వారా ప్రదర్శించేవాళ్లం. ప్రతిపాత్రకు జీవం పోసేవాళ్లం. చూసే వాళ్ల నుంచి ప్రశంసలు పొందేవాళ్లం. నా చిన్నప్పుడు నాటకాలు వేసినప్పుడు ప్రజలు ఎంతగానో ఇష్టపడి చూసేవారు. ఈ రోజుల్లో అందరూ టీవీ సీరియల్స్‌కు అలవాటు పడ్డారు. ప్రస్తుతం యక్షగానం ప్రదర్శిస్తే ఆ నాటి వారు తప్ప నేటి యువత చూస్తారనుకోవటం భ్రమే.

- చిన్నతనం నుంచే చిందు యక్షగానంలో రాణిస్తున్న పిల్లుట్ల దేవదాసు
- తండ్రి అబ్బసాయిలే ఆదర్శం
- సుమారు 20 వేలకు పైగా నాటకాల ప్రదర్శన
- మైరావణుడు పాత్ర ఆయనకెంతో ఇష్టం
- పలు అవార్డులతో ప్రముఖుల సత్కారం
- అనేక రాష్ట్రాల్లో ప్రదర్శనలు
- తెలంగాణ ఉద్యమంలో కళల ద్వారా తనవంతు సాయం
- యక్షగానానికి పూర్వవైభవం తీసుకొచ్చేందుకు ఇప్పటికీ కృషి

మా నాన్న గురించి అందరికీ తెలుసు

సిద్దిపేట పట్టణ పరిధిలోని ఇమాంబాద్ గ్రామానికి చెందిన పిల్లుట్ల అబ్బసాయిలు అంటే సిద్దిపేట, కరీంనగర్, వరంగల్ జిల్లాలో తెలియని వారుండరు. ఆయనే మా నాన్న. అప్పట్లో వీధి నాటకాలల్లో మేటేశం వేయాలన్నా, ఆ వేశానికి తగ్గ పాటలు, పద్యాలు చెప్పడం, గంభీరమైన గొంతుతో మాట్లాడటం మా నాన్నకే సాధ్యం. అనేక సందర్భాల్లో ఇతర జిల్లాల్లోకి వెళ్లి ఇతరుల నాటకాల్లో అబ్బసాయిలు రంగస్థలంపై నటించిన సంఘటనలున్నాయి. పిల్లుట్ల లక్ష్మి - అబ్బసాయిలు దంపతులకు మేము ఎనిమిది మంది సంతానం. 1970లో నేను మొదటి సంతానంగా జన్మించాను. పెద్ద కుమారుడిని కావడంతో తండ్రి బాటనే ఎంచుకున్నాను. అదే గ్రామంలో ఐదోతరగతి వరకు, సిద్దిపేట ప్రభుత్వ బాలుర పాఠశాలలో పదో తరగతి వరకు చదివాను. చదువుకుంటున్నప్పుడే మా నాన్న వేసే నాటకాలల్లో తాళాలు, తబలా, హార్మోనియం వాయించేవాడిని. నాటకాలపై నాకున్న ఆసక్తిని గమనించిన మా నాన్న తెల్లవారుజామున 4గంటలకే లేపి పాటలు, పద్యాలు కంఠస్తం చేయించే వారు. వీధి నాటకాల్లో ప్రహ్లాదుడు, శిరియాలుడు, లవకుశులు వంటి పాత్రలు పోశించాను. తదనంతరం ప్రధాన పాత్రలు రావణుడు, మైరావణుడు, అభిమన్యుడు, నారదుడు వంటి మేటి వేశాలు వేసి ప్రజల మెప్పు పొందాను. నేను వేశంతో ప్రదర్శన ఇచ్చినప్పుడు ప్రజల నుంచి వచ్చిన ఆదరణ, అభిమానం చూశాక నాన్నగారి సంప్రదాయ(కుల వృత్తి) కళను బతికించాలనే తపన నాలో రేకెత్తింది.

అన్ని వర్గాల నుంచి ఆదరణ

మేము దళిత వాడలతో పాటు అంతటా యక్షగాన ప్రదర్శనలు ఇచ్చేవాళ్లం. నా చిన్నప్పటి నుంచి ఏ గ్రామంలో నాటకం వేసినా గ్రామంలోని కచ్చీరు (గ్రామ పంచాయతీ వద్ద)కాడనే ఆడెటోళ్లం. దళితుల ఇంట్లో ఏదైనా శుభాకార్యాలు ఉన్నప్పుడు వారు ప్రత్యేకంగా నాటకం ఆడమని చెప్పేవారు. అలా ఎక్కువగా మేము నాటకాలు దళితవాడల్లో వేసేవాళ్లం. అలా అని కేవలం ఆ వాడలకే మేము పరిమితం కాలేదు. మా నాటకాలకు అంతటా సంపూర్ణ మద్దతు లభించింది. అన్ని కులాల వారు అధిక సంఖ్యలో వచ్చి నాటకాలు తిలకించేవారు. మిగతా కళారూపాలతో పోలిస్తే యక్షగానానికి ప్రత్యేక ఆదరణ ఉంది. ఇది గ్రేడ్‌వన్‌లో ఉంది. జాంబవంతుని వారసత్వంగా వచ్చిన కళ ఇది. నాటకాల నుంచి సినిమాలు వచ్చినట్లుగా.. యక్షగానం నుంచే బుర్ర కథ, ఒగ్గు కథ, హరి కథలు పుట్టుకొచ్చాయి. కొత్తగా యక్షగాన కళ నేర్చుకోవాలంటే అక్షర జ్ఞానం ఉండాలి. కళపై అభిమానం ఉండాలి. ఆసక్తి ఉండాలి. తెలంగాణ ప్రభుత్వం కళలు, కళాకారులను బాగా ప్రోత్సహిస్తోంది. కళాకారులను గుర్తించి ఉద్యోగం ఇచ్చింది. సాంస్కృతిక సారథిలో భాగంగా యక్షగాన కళాకారుల్లో రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 15మందికి ఉద్యోగం వచ్చింది. ఈ విషయంలో సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు, సాంస్కృతి సారథి ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, దేశపతి శ్రీనివాసులకు నా కృతజ్ఞతలు. యక్షగానానికి పూర్వవైభవం తీసుకొచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. తెలుగు విశ్వవిద్యాలయంలో యక్షగానం శిక్షణ తరగతులు నిర్వహించేందుకు పాటుపడుతోంది. భవిష్యత్తులో యక్షగానం ఓ కొత్త కళగా, ఆసక్తికరంగా ఉంటుందని నా వ్యక్తిగత అభిప్రాయం.

ఎల్లలు దాటిన ప్రదర్శనలు

యక్షగాన ప్రదర్శనలను తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడులోని మద్రాసు, మహారాష్ట్రలోని నాగ్‌పూర్, ముంబై, రాజస్థాన్, హరియాణ, భూపాల్ తదితర ప్రాంతాల్లో ప్రదర్శనలిచ్చారు. తిరుపతిలో నిర్వహించిన ప్రపంచ తెలుగు మహాసభలల్లో యక్షగాన కళాప్రదర్శన ఇచ్చాను. కందుకూరి వీరేశలింగం పంతులు జయంతి సందర్భంగా ఏర్పాటు చేసి కళా ప్రదర్శనలల్లో నేను ప్రదర్శించిన యక్షగానానికి మొదటి బహుమతితో పాటు రూ.10 వేల రివార్డు దక్కింది.

రసమయి బాలకిషన్‌తో

1990లో వయోజన విద్యపై అప్పటి ప్రభుత్వం మంజీర అక్షర ప్రభ అనే పథకాన్ని ప్రవేశ పెట్టింది. అప్పటికే జానపద కళాకారునిగా గుర్తింపు పొందిన ఏర్పుల బాలకిషన్ (ప్రస్తుతం మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్) ఏర్పాటు చేసిన రసమయి జానపద కళా సంస్థలో చేరి సుమారు పది సంవత్సరాల పాటు పని చేశా. అనంతరం మేమే స్వయంగా శ్రీసత్య కళా నాట్యమండలిని ఏర్పాటు చేసుకున్నాం. ఉమ్మడి మెదక్ జిల్లా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలపై యక్షగానం ద్వారా ప్రచారం చేపట్టేవాళ్లం.

ఉత్తమ జానపద కళాకారుడిగా

గ్రామాల్లో యక్షగానం ద్వారా ప్రదర్శనలిస్తున్నప్పుడే దూరదర్శన్, ఆల్ ఇండియా రేడియాలో కార్యక్రమాలు చేశాను. అప్పటి రాష్ట రవాణ శాఖ మంత్రి (ప్రస్తుత ముఖ్యమంత్రి) కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు చేతుల మీదుగా ఉత్తమ జానపద కళాకారుడిగా అవార్డు పొందాను. రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ఢిల్లీలో నిర్వహించిన యక్షగాన కళ ప్రదర్శకుగాను హరిప్రియ రంగరాజన్ చేతుల మీదుగా 'పల్లె సుద్దులు' అవార్డు పొందాను. ఉమ్మడి మెదక్ జిల్లా ఇంచార్జి మంత్రి గీతారెడ్డి, మంత్రి తన్నీరు హరీశ్‌రావుల చేతుల మీదుగా ఉత్తమ జానపద కళాకారుడిగా అవార్డు పొందాను. సాంస్కృతిక శాఖ రాష్ట్ర డైరెక్టర్లు కేవీ రమణాచారి, అర్జా శ్రీకాంత్, కవితప్రసాద్, ఉమ్మడి మెదక్ జిల్లా కలెక్టర్లు లతకృష్ణారావు, బూర వెంకటేశం, దినకర్‌బాబు, స్మితసబర్వాల్ తదితరుల చేతుల మీదుగా అవార్డులు, సన్మానాలు పొందాను.

20 వేలకు పైగా నాటకాలు ప్రదర్శించా

యక్షగానం నేర్చుకుంటే భవిష్యత్ ఎలా ఉంటుందనేది మొదట నాకు తెలియదు. నాన్న వెంట వెళ్లి వేశాలు వేశాను. నా చిన్నప్పటి నుంచి సుమారు 20వేలకు పైగా నాటకాలు ప్రదర్శించి ఉంటాను. నాకు బాగా నచ్చిన నాటకం చిరుతోండ. ఇక నాకు బాగా నచ్చిన పాత్ర భానసూరవధలో భనాసూరుడు. నేను బాగా పాపులర్ అయిన నాటకం, పాత్ర విషయానికొస్తే..మైరావణుడు. భానసూరవధ నాటకంలోని భానసూరుని పాత్రకు రవీంద్ర భారతిలో మొట్ట మొదటిసారి అవార్డు వచ్చింది. అలాగే మా బృందంలో నాతో పాటు మా తమ్ముడు చిరంజీవికి, బృందంలోని చంద్రమౌళి, వెంకటయ్య, కిష్టయ్య, భుజంగంలకు పలు అవార్డులు వచ్చాయి. ఒక నాటకం వేయలంటే కనీసం 12మంది సభ్యులు ఉండాల్సిందే. నా చిన్ననాటి తనంలో వేరే పని చేసేవాళ్లం కాదు. కానీ ఇప్పుడు నాటకాలు వేసే వారు ఇతర కూలీ పనికి వెళ్లాల్సి వస్తోంది. చాలామంది కళాకారులు దినసరి కూలీలుగా పనిచేస్తు కుంటుంబాన్ని పోషించుకుంటున్నారు. నాకు పెళ్లయ్యాక కూడా నాటకాలు వేసి ఉపాధి పొందాను. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నందుకుగాను స్వరాష్ట్రం ఏర్పాటు అయ్యాక సాంస్కృతిక సారథిలో ఉద్యోగం ఇచ్చారు. ఇప్పుడిప్పుడే కుటుంబం కుదురుకుటుంది.


యక్షగాన ప్రదర్శనలో దేవదాసు బృందం

నా కల నేరింది

మా నాన్న గర్వపడేలా నేను చిందు కళా యక్షగానాన్ని ప్రదర్శించాలనుకున్నాను. ఆ కల నెరవేరింది. నేను సమాజంలో కళాకారునిగా ఎదగడానికి అప్పటి జానపద కళాకారులు ఎస్.ప్రభాకర్, రసమయి బాలకిషన్, చీకోటి కృష్ణన్న, కళా రాజేశ్ తదితరులు నాకు సహకరించారు. వారిని ఎప్పటికీ మర్చిపోను. తెలంగాణ ప్రభుత్వం యక్షగాన కళాకారులను గుర్తించి ప్రత్యేక సంక్షేమ పథకాలు అంంచాలి.

డబ్ల్యూహెచ్ఓ రాయబారి మిల్కాసింగ్

అంతర్జాతీయం

పోలియో రహిత దేశంగా సోమాలియా

ప్రపంచ ఆరోగ్య సంస్థ సోమాలియాను పోలియో రహిత దేశంగా ఆగస్టు 13న ప్రకటించింది. మూడేళ్లగా సోమాలియాలో ఒక్క పోలియో కేసు కూడా నమోదు కాలేదు. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా ఆఫ్ఘనిస్తాన్, నైజీరియా, పాకిస్తాన్ లలో మాత్రమే పోలియో కేసులు నమోదవుతున్నాయి. సోమాలియాలో చివరిగా 2014లో పోలియో కేసు నమోదైంది. సోమాలియాను పోలియో రహిత దేశంగా ప్రకటించినా వ్యాధికి గురయ్యే అవకాశాలు ఉన్నందువల్ల టీకాలను నిరంతరం అందించాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచించింది.

బార్సిలోనాలో ఉగ్రదాడి



స్పెయిన్‌లోని బార్సిలోనాలో ఆగస్టు 17న ఉగ్రవాదులు జరిపిన దాడిలో 13 మంది మరణించారు. బార్సిలోనాలోని లస్ రంబ్లస్ రహదారిలో ఉగ్రవాదులు వ్యానుతో పాదచారుల పైకి దూసుకెళ్లడంతో పలువురు గాయపడ్డారు. దాడి తమ పనేనని ఐసిస్ ఉగ్రవాద సంస్థ ప్రకటించింది. పోలీసులు ఐదుగురు ఉగ్రవాదులను కాల్చి చంపారు. పర్యాటకులు, జనసంచారంతో ఉండే ఈ దారిని దాడికి ఉగ్రవాదులు ఎన్నుకొన్నారు. 2004లో స్పెయిన్‌లోని మాడ్రిడ్‌లో అల్‌ఖైదా ప్రేరేపిత ఉగ్రవాదులు రైళ్లలో పేలుళ్లకు పాల్పడటంతో 191 మంది మరణించారు.

అమెరికా ఉగ్ర జాబితాలో 'హిజ్బుల్ ముజాహిదీన్'

కశ్మీర్‌లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న హిజ్బుల్ ముజాహిదీన్‌ను విదేశీ ఉగ్రవాద సంస్థగా అమెరికా ప్రకటించింది. హిజ్బుల్ అధిపతి సయ్యద్ సలావుద్దీన్‌ను రెండు నెలల క్రితం అంతర్జాతీయ ఉగ్రవాదిగా అమెరికా ప్రకటించింది. 1989లో ఏర్పాటైన హిజ్బుల్ కశ్మీర్‌లో పెద్ద ఉగ్రవాద సంస్థల్లో ఒకటి. తాజా ప్రకటనతో ఆ సంస్థకు నిధుల సమీకరణ కష్టతరం కానుంది. ఆంక్షల కారణంగా హిజ్బుల్‌పై చట్టపరమైన సంస్థలు చర్యలు చేపట్టడానికి వీలుంటుంది.

కరెంట్ అఫైర్స్



రామచంద్రారెడ్డి ఉప్పుల

పురస్కారం

శంకర్‌రావుకు రాష్ట్రపతి పోలీస్ శౌర్య పతకం

ఛత్తీస్‌గఢ్ పోలీస్ జవానుకు ఈ ఏడాది అత్యున్నత పోలీస్ పురస్కారం లభించింది. కమాండర్ శంకర్‌రావుకు మరణానంతరం 'రాష్ట్రపతి పోలీస్ శౌర్య' పతకాన్ని ప్రకటించారు. 2015లో నక్సల్స్‌తో జరిగిన పోరులో ఛత్తీస్‌గఢ్ పోలీస్ ప్లటూన్ కమాండర్ శంకర్‌రావు ప్రాణాలు కోల్పోయారు. పోలీస్ విభాగంలో అత్యున్నత పురస్కారంగా భావించే రాష్ట్రపతి పోలీస్ శౌర్య పతకాన్ని పొందారు.

ఐదుగురికి 'కీర్తిచక్ర'

శాంతి సమయంలో సైనికులకు ఇచ్చే రెండో అత్యున్నత పురస్కారం 'కీర్తిచక్ర'కి ఈ సారి ఐదుగురిని ఎంపిక చేశారు. వీరిలో ముగ్గురికి మరణానంతరం ప్రకటించారు. వారిలో గూర్ఖా రైఫిల్స్‌కి చెందిన హవాల్దార్ గిరిస్ గురుంగ్, నాగా రెజిమెంట్‌కు చెందిన మేజర్ డేవిడ్ మన్నుం, సీఆర్పీఎఫ్ 49వ బెటాలియన్ కమాండెంట్ ప్రమోద్ కుమార్ ఉన్నారు. గార్వాలా రైఫిల్స్‌కు చెందిన మేజర్ ప్రీతం సింగ్, సీఆర్పీఎఫ్ సీనియర్ అధికారి చేతన్‌కుమార్ చీతా కీర్తిచక్ర పొందిన మిగిలిన ఇద్దరు.

జాతీయం

రికార్డు స్థాయిలో ఆహార ధాన్యాల దిగుబడి

దేశంలో ఆహార ధాన్యాల దిగుబడి 2016-17 సంవత్సరంలో రికార్డు స్థాయిలో నమోదైంది. 2016-17 మొత్తం 27.56 కోట్ల టన్నుల ఆహార ధాన్యాలు ఉత్పత్తి అయినట్లు కేంద్రం ఆగస్టు 16న ప్రకటించింది. 2015-16లో 25.17 కోట్ల టన్నుల ఆహార ధాన్యాల దిగుబడి వచ్చింది. వరి దిగుబడి 10.41 కోట్ల టన్నుల నుంచి 11.01 కోట్ల టన్నులకు పెరిగింది. గోధుమలు 9.29 కోట్ల టన్నుల నుంచి 9.83 కోట్ల టన్నులకు, పప్పు ధాన్యాలు 1.63 కోట్ల టన్నుల నుంచి 2.29 కోట్ల టన్నులకు పెరిగింది. చెరకు ఉత్పత్తి 11.98 శాతం మేర పడిపోయింది. పత్తి ఉత్పత్తి 3.01 కోట్ల బేళ్ల నుంచి 3.30 కోట్ల బేళ్లకు పెరిగింది.

ఇన్ఫోసిస్ సీఈవో విశాల్ సిక్కా రాజీనామా



ఇన్ఫోసిస్ సీఈవో విశాల్ సిక్కా తన పదవికి ఆగస్టు 18న రాజీనామా చేశారు. సీఈవోగా తప్పుకొన్న సిక్కాను కంపెనీ ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్‌గా నియమించారు. తాత్కాలిక సీఈవో & ఎండీగా యూబీ ప్రవీణ్ రావును నియమించారు. 2014 జూన్ 12న సిక్కా ఇన్ఫోసిస్ సీఈవో & ఎండీగా బాధ్యతలు చేపట్టారు. 1986లో ఇన్ఫోసిస్‌లో చేరిన ఆయన ప్రస్తుతం చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. సీబీఐ నేషనల్ కౌన్సిల్, నాస్కామ్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌లో ప్రవీణ్ సభ్యుడిగా ఉన్నారు. ఇన్ఫోసిస్ బీపీవోకు కూడా ప్రవీణ్ ఛైర్మన్.

డబ్ల్యూహెచ్ఓ రాయబారి మిల్కాసింగ్

పరుగుల వీరుడు మిల్కాసింగ్ ప్రపంచ ఆరోగ్య సంస్థ సౌహార్ద రాయబారిగా నియమితులయ్యారు. దక్షిణాసియా ప్రాంతంలో శారీరక శ్రమ పెంపుదల ఆవశ్యకతపై ప్రచారం చేయడానికి మిల్కాను ప్రపంచ ఆరోగ్య సంస్థ ఎంపిక చేసింది. ఈ ప్రాంతంలో 2025 నాటికి శారీరక శ్రమ 90 శాతం ఉండేలా, అంటువ్యాధులు కాని రోగాల విస్తృతిని 25 శాతానికి పరిమితం చేసేలా డబ్ల్యూహెచ్ఓ కార్యాచరణ రూపొందించింది. దీనికి ప్రచార కర్తగా మిల్కాను నియమించింది.

క్రీడలు

బల్గేరియా ఓపెన్ విజేత లక్ష్యసేన్



బల్గేరియా ఓపెన్ బ్యాడ్మింటన్ పురుషుల సింగిల్స్ టైటిల్ విజేతగా భారత యువ క్రీడాకారుడు లక్ష్యసేన్ నిలిచాడు. బల్గేరియా రాజధాని సోఫియాలో జరిగిన టోర్నీ పురుషుల సింగిల్స్ ఫైనల్లో లక్ష్యసేన్ 18-21, 21-12, 21-17తో క్రొయేషియాకు చెందిన రెండో సీడ్ డురోకిన్ జాక్‌పై గెలిచి టైటిల్ సొంతం చేసుకున్నాడు. లక్ష్యకు ఇది రెండో అంతర్జాతీయ టైటిల్. గతేడాది ఇండియా ఇంటర్నేషనల్ సిరీస్ టైటిల్‌ను గెలుచుకొన్నాడు. ప్రస్తుతం జూనియర్ ప్రపంచ నెంబర్ వన్‌గా ఉన్న లక్ష్యసేన్‌కు సీనియర్ విభాగంలో ఇది రెండో అంతర్జాతీయ టైటిల్.

శ్రీలంకతో టెస్ట్ సిరీస్ క్లీన్‌స్వీప్

శ్రీలంకతో జరిగిన మూడు టెస్టుల సిరీస్‌ను భారత్ 3-0తో క్లీన్‌స్వీప్ చేసింది. విదేశీ గడ్డపై మూడు టెస్టుల సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసిన తొలి భారత జట్టుగా కోహ్లీ సేన ఘనత సాధించింది.



